www.visalaandhra.com

గురువారం
21-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 30
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ఏపీ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు

సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురు కొత్త న్యాయమూర్తులను నియమించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకట రమణ నేతృత్వంలో జరిగిన కొలీజియం ఈ మేరకు సిఫార్సు చేసింది. ఏడుగురు న్యాయాధికారులకు జడ్జీలుగా పదోన్నతి కల్పించారు. అడుసుమిల్లి వెంకట రవీంద్రబాబు, వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్, బండారు శ్యామ్‌సుందర్, ఊటుకూరు శ్రీనివాస్, బోపన్న వరహ లక్ష్మీనరసింహ చక్రవర్తి, తల్లాప్రగడ మల్లికార్జునరావు, దుప్పల వెంకటరమణ పేర్లను జడ్జీలుగా కొలీజియం సిఫార్సు చేసింది. కొలీజియం సిఫార్సుకు త్వరలో రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు.
ఏపీ హైకోర్టులో ఫిబ్రవరి నెలలో ఏడుగురు న్యాయమూర్తులను నియమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొద్దినెలల తేడాలోనే మరో ఏడుగురు న్యాయమూర్తుల నియామకం

- మిగతా 2 లో

మూసేవాలా హంతకుల ఎన్‌కౌంటర్

అమృత్‌సర్ సమీపంలో భీకర కాల్పులు

అమృత్‌సర్:
ప్రముఖ పంజాబీ గాయకుడు, కాంగ్రెస్ నేత సిద్ధూ మూసేవాలా హత్య కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు గ్యాంగ్‌స్టర్లను పంజాబ్ పోలీసులు బుధవారం ఎన్‌కౌంటర్ చేశారు. అమృత్‌సర్ సమీపంలోని భక్నా గ్రామంలో గ్యాంగ్‌స్టర్లు, పోలీసులు మధ్య భీకర కాల్పులు జరిగాయి. నాలుగు గంటలు జరిగిన ఈ ఎన్‌కౌంటర్ ముగిసిందని, ఇద్దరు ముఠా నాయకులను మట్టుబెట్టినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. మృతులను జగ్‌రూప్ సింగ్ రూపా, మన్‌ప్రీత్ సింగ్‌గా గుర్తించారు. వీరిద్దరూ మూసేవాలా హత్య కేసులో నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో నిందితులు, అనుమానితులను పట్టుకునేందుకు గ్యాంగ్‌స్టర్ నిరోధక టాస్క్‌ఫోర్స్ కొంతకాలంగా ఆపరేషన్ చేపట్టింది. ఇందులో భాగంగానే భక్నా గ్రామంలో గాలింపు చేపట్టగా గ్యాంగ్‌స్టర్లు కాల్పులు జరిపారు. దీంతో ఎదురుకాల్పులు జరిపిన పోలీసులు ఇద్దరిని హతమార్చారు. వారి నుంచి ఏకే 47, తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఏడాది మే 29న సిద్ధూ మూసేవాలా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. స్నేహితులతో కలిసి

- మిగతా 2 లో

యోగికి అసమ్మతి సెగ

- జలశక్తి మంత్రి దినేశ్ ఖటిక్ రాజీనామా- అమిత్‌షాకు లేఖ
- ఢిల్లీలో పార్టీ పెద్దలతో భేటీకి జితిన్ ప్రసాద యత్నం



లక్నో:
ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం సొంతవర్గం నుంచి తిరుగుబాటును ఎదుర్కొంటోంది. యోగి పనితీరుపై సీనియర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యమంత్రి అన్ని శాఖలపై పెత్తనం చలాయించడం, తమ శాఖల బదిలీల్లోనూ జోక్యం చేసుకోవడం వంటివి వారికి కోపం తెప్పించాయి. ఇదే క్రమంలో జలశక్తి శాఖ సహాయమంత్రి, దళిత నాయకుడు దినేశ్ ఖటిక్ బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ముఖ్యమంత్రికి బదులుగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పంపారు. దళితుడిని కాబట్టే శాఖలో తన మాటకు గౌరవం లేదని, విలువ లేనప్పుడు పదవి ఎందుకనే రాజీనామా చేస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. మరో మంత్రి జితిన్ ప్రసాద కూడా ప్రభుత్వ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆయన రాజీనామా చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.
'వంద రోజులుగా నాకు ఏ పని ఇవ్వలేదు. నేను కలత చెందాను కాబట్టే రాజీనామా చేస్తున్నా. శాఖ బదిలీల్లో అవకతవకలు జరుగుతున్నాయి. దళితుడిని కాబట్టే నాకు ప్రాధాన్యత లేదు. మంత్రిగా అధికారం లేదు. నేను మంత్రిగా ఉండటం వల్ల దళిత వర్గానికి ప్రయోజనం లేదు. నన్ను ఏ సమావేశానికి పిలవడం లేదు. నా మంత్రిత్వశాఖ గురించి

- మిగతా 2 లో

చర్చకు భయమెందుకు?

- ధరలపై దద్దరిల్లిన పార్లమెంట్
- మూడో రోజూ నిరసనల హోరు
- ఉభయ సభలు వాయిదా

ధరల పెరుగుదల, నిత్యావసరాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధింపుపై ప్రతిపక్ష పార్టీల నిరసనలతో పార్లమెంట్ మరోసారి దద్దరిల్లింది. సమావేశాల మూడు రోజు బుధవారం కూడా ఉభయ సభల్లోనూ విపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు.

2లో

శ్రీలంక కొత్త సారథి విక్రమసింఘే

కొలంబో:
కొద్దినెలలుగా కొనసాగుతోన్న శ్రీలంక రాజకీయ సంక్షోభం ఒక కొలిక్కి వచ్చింది. కొత్త నాయకత్వం కోసం బుధవారం జరిగిన ఓటింగ్‌లో యూఎన్‌పీ పార్టీ అధినేత రణిల్ విక్రమసింఘె శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
బుధవారం ఉదయం 10 గంటలకు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే ఓటింగ్ జరిగింది. రహస్య బ్యాలెట్ విధానంలో జరిగిన ఈ ఎన్నికలో రణిల్ విజయం సాధించారు. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోన్న శ్రీలంక ప్రజలు రాజపక్స కుటుంబ పాలనతో విసిగిపోయారు. రాజపక్స సోదరులు అధ్యక్ష, ప్రధాని పదవులను నుంచి గద్దె దిగే వరకూ తీవ్రస్థాయి ఆందోళనలు చేపట్టారు. దాంతో గొటబాయ రాజపక్స అధ్యక్ష పదవి నుంచి దిగిపోగా.. రణిల్ విక్రమసింఘె తాత్కాలిక అధ్యక్షుడిగా

- మిగతా 2 లో

గోదావరి వరదలు జాతీయ విపత్తు

- తక్షణమే కేంద్రం ప్రకటించాలి
- ద్వంద్వ వైఖరి విడనాడాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-రాజానగరం/రాజమహేంద్రవరం:
ఉభయగోదావరి జిల్లాల్లో గోదావరి ఉగ్రరూపం దాల్చి ముంచెత్తిన వరదలను జాతీయ విపత్తుగా కేంద్రం ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు.
రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అధ్వర్యంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నారాయణ మాట్లాడారు.
ఉభయగోదావరి జిలాల్లో జాతీయ విపత్తులను దృష్టిలో పెట్టుకొని యుద్ధప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వం తక్షణమే సహాయచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరదలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు సర్వం కోల్పోయారని, వారిని ఆదుకోవడంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల తాను చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలు భాషాదోషం కారణంగా ఆయన అభిమానులు బాధపడ్డారని, దానికి తాను సైతం చింతిస్తున్నానన్నారు. వరద బాధితుల సహాయం నిమిత్తం సీపీఐ బృందంతో పాటు చిరంజీవి అభిమానుల సైతం కలిసి రావాలని పిలుపునిచ్చారు.
రాష్ట్ర విభజన అనంతరం ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం సరికాదని రెండు రాష్ట్ర మంత్రులకు హితవు పలికారు. వరద విపత్తును అరికట్టడంలో, ప్రజా సమస్యలు పరిష్కరించడంలో రెండు రాష్ట్రాలు విఫలం అయ్యాయన్నారు. ముంపు మండలాలు వెనక్కి ఇస్తే భవిష్యత్తులో వచ్చే ముంపులు నివారించగలరా అని ప్రశ్నించారు. చరిత్రను వెనక్కి తియ్యడం సాధ్యం కాదని, భవిష్యత్తును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలవరం అంశంపై మళ్లీ విమర్శిస్తే తెలంగాణ, ఆంధ్ర ప్రజలకు ద్రోహం చేసిన వారిగా చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. రాష్ట్రపతి ఎన్నికలో ఓట్లేసిన నాయకులు విపత్తులపై ఎందుకు నిలదీయడం లేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు బల్లలు బద్దలకొట్టిన జగన్ ప్రత్యేక హోదాపై కేంద్రం మెడలు ఎందుకు వంచడం లేదో చెప్పాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అయ్యేలా ఉందన్నారు. ఓటమి భయంతోనే జగన్ గజగజ వణుకుతున్నారని, అందుకే

- మిగతా 2 లో

ప్రత్యేక హోదా సాధన కోసం

సమష్టి పోరాటానికి సిద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఏపీకి ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదేపదే చెప్పడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీలను సాధించేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు సమష్టి పోరాటానికి సిద్ధంకావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని సాక్షాత్తూ పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రకటించడం దుర్మార్గం. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అడుగడుగునా మోసం చేస్తూనే ఉంది. విభజన హామీలు నెరవేర్చామని

- మిగతా 2 లో

అన్ని కేసుల్లో జుబేర్‌కు బెయిల్

ఎంతకాలం నిర్బంధిస్తాం: సుప్రీం

న్యూఢిల్లీ:
ఆల్ట్ న్యూస్ సహవ్యవస్థాపకుడు, జర్నలిస్టు మహ్మద్ జుబేర్‌కు భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన అన్ని కేసుల్లో సుప్రీంకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. ఆయన్ను సాయంత్రం 6 గంటలకు విడుదల చేయాలని ఆదేశించింది. అన్ని ఎఫ్ఐఆర్‌లపై ఆయనను మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని అభిప్రాయపడు తున్నామని, అరెస్టుల అధికారాన్ని పొదుపుగా కొనసాగించాలనేది చట్టానికున్న నిర్ధిత సూత్రమని, ప్రస్తుతం అతన్ని నిరంతర నిర్బంధంలో ఉంచడం, వివిధ కోర్టుల్లో అంతులేని

- మిగతా 2 లో

ప్రసూతి మరణాల్లో భారత్ నం.2 — 2 లో

ఇదీ లోకం!

రామాయపట్నం పోర్టుతో ఎంతో మేలు

- 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు
- ప్రస్తుతానికి అందుబాటులో నాలుగు బెర్త్‌లు
- సహకరించిన వారందరికీ ధన్యవాదాలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:
రామాయపట్నం పోర్టులో ఎంతో మేలు జరుగుతుందని, ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలోని రామాయపట్నం

- మిగతా 2 లో

ఇరాన్-రష్యాల స్నేహంతో ప్రాంతీయ భద్రత

టెహ్రాన్: ఇరాన్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి, సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ కట్టుబడిఉంటామని పేర్కొన్నారు. ఇరాన్ ప్రెసిడెన్సీ వెబ్‌సైట్ నివేదిక ప్రకారం, సిరియా సమస్యపై రైసీ, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్‌లతో త్రైపాక్షిక సమావేశంలో పాల్గొనడానికి పుతిన్ మంగళవారం మధ్యాహ్నం టెహ్రాన్‌కు వచ్చిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.రైసీ పరిపాలన లో గణనీయంగా మెరుగుపడిన ద్వైపాక్షిక సంబంధాలలో తాజా పరిణామాలను ఇరుపక్షాలు సమీక్షించాయి, ముఖ్యంగా ఆర్థిక, భద్రత, మౌలిక సదుపాయాలు, ఇంధనం, వాణిజ్యం, పరిశ్రమల రంగాలలో పురోగతి పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే మార్గాన్ని కొనసాగించాలని ఇరువురు అధ్యక్షులు కూడా కృతనిశ్చయం వ్యక్తం చేశారు. తీవ్రవాదంపై పోరాటంలో ఉమ్మడి విజయాలను ప్రశంసిస్తూ, రైసీ, పుతిన్ ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను ఎత్తి చూపారు, ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించాలనే రెండు దేశాల సంకల్పం "గొప్పది" అని రైసీ అభివర్ణిస్తూ, జనవరి చివరలో మాస్కోలో పుతిన్, జూన్ చివరిలో అష్గాబాత్‌తో తన సమావేశాల తరువాత, ఇరాన్-రష్యాల మధ్య సహకారం మరింత బలపడిందన్నారు. సిరియాలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో "విజయవంతమైన" ద్వైపాక్షిక సహకారంపై, ఇరాన్ అధ్యక్షుడు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ రష్యా సహకారంతో ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో తమ నిజాయితీని, దృఢ సంకల్పాన్ని నిరూపించుకున్నాయని ఆయన అన్నారు.

ఇటలీలో కార్మిక చట్టాల అమలుకు పోరు

రోమ్: కార్మిక చట్టాలను అమలు చేయాలని ఇటలీలో ట్రేడ్ యూనియన్‌లు చేపట్టిన చర్యలను నేరంగా పరిగణించే ప్రభుత్వ ప్రయత్నాలను ఆల్-వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎమ్ఈ) తీవ్రంగా ఖండించింది. ఇటలీలో కార్మికుల సమస్యలపై సంఘటితంగా ఉద్యమిస్తున్న యూఎస్‌బీ, సి కొబాస్ యూనియన్‌లపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ వారిపై వివిధ నేరారోపణలను మోపడాన్ని తీవ్రంగా గర్హించాయి. దీనిలో ఉన్న యూనియన్‌లు, ట్రేడ్ యూనియన్‌లు లాజిస్టిక్స్ రంగంలో కార్మికులు చేపట్టిన పికెటింగ్‌లు, సమ్మెలు, నిరసనలు, సమీకరణల వంటి అంశాలపై వివిధ నేరారోపణలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేరారోపణ ఆధారంగా పోలీసులు ట్రేడ్ యూనియన్‌ల నాయకులను వారి ఇళ్లలో ఆపరేషన్ చేపట్టి 4 యుఎస్‌బి ట్రేడ్ యూనియన్ నాయకులను అరెస్టు చేశారు. యూరప్ అంతటా కార్మికులు తమ వేతనాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో వేతనాల పెంపుదలను డిమాండ్ చేస్తున్న కార్మికులపై యజమానులు, ప్రభుత్వాలు సంఘటితం కాకుండా నిరోధించడానికి కుట్రలు పన్నుతున్నాయి. సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మికుల హక్కులను కాపాడుతున్న ట్రేడ్ యూనియన్‌ల చర్యలను నేరంగా పరిగణించి విచారణ చేయడం ఇప్పుడు గ్రీస్, యూరప్ అంతటా పెద్ద ఎత్తున కొనసాగుతోంది. ఇటలీ ప్రభుత్వ యంత్రాంగం లక్ష్యంగా హింసకు గురవుతున్న ఇటాలియన్ ట్రేడ్ యూనియన్‌లు యూఎస్‌బీ, సి కోబాస్ ఇటలీలోని కార్మికులందరికీ తమ సంఘీభావాన్ని ప్రకటించాయి.

విశాలాంధ్ర ప్రపంచం

ప్రకృతి జీవనం అవశ్యం: గుటెర్రస్

ఐరాస: ప్రకృతికి అనుగుణంగా జీవించడానికి మానవాళి సరికొత్త మార్గాన్ని అనుసరించాల్సిన సమయం ఆసన్నమైందని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నారు. "మూమెంట్ ఫర్ నేచర్" అనే శీర్షికతో జనరల్ అసెంబ్లీ చేపట్టిన చర్చలకు సంబంధించిన వీడియో సందేశంలో ఐరాస చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి ప్రయోజనాలు క్షీణించడంతో వాతావరణంలో అంతరాయం, జీవవైవిధ్య నష్టంతో కాలుష్యం మూడురెట్లు పెరిగిందని గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేశారు. జీవ వైవిధ్య కాలుష్యంతో మిలియన్ జాతుల మొక్కలు, జంతువులు అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. లక్షలాది మంది జీవనోపాధికి ముప్పు వాటిల్లుతోందన్నారు. భూమిలో మూడు వంతులు, సముద్రంలో మూడింట రెండు వంతులు మానవ కార్యకలాపాల వల్ల ప్రతికూలంగా ప్రభావితమవుతాయి. దాదాపు 3.2 బిలియన్ల మంది ప్రజలు పర్యావరణం క్షీణతతో బాధపడుతున్నారని గుటెర్రస్ చెప్పారు. "మానవ కార్యకలాపాలు గ్రహాల గమనానికి మూలం కాబట్టి, పరిష్కారాలు కీలకమని పేర్కొన్నారు. ప్రకృతితో మనిషి సమన్వయం చేసుకోవడం ద్వారా నూతన మార్గాన్ని అమలు చేయవలసిన సమయం వచ్చిందన్నారు. ఈ ఏడాది చివర్లో ఈజిప్టు, కెనడాలో జరగనున్న కాప్27 వాతావరణ సదస్సు, కాప్15 జీవవైవిధ్య సదస్సు రెండవ దశను ప్రస్తావిస్తూ, 'ఉద్గారాలను తగ్గించడం, జీవవైవిధ్య నష్టానికి ప్రధాన చోదకాలను పరిష్కరించడం, ఆర్థిక అంతరాన్ని పూడ్చడం వంటి లక్ష్యాలతో ఈ సదస్సులలో నిబద్ధతలను ధైర్యంగా, ప్రపంచ వ్యాప్తంగా ఏకాభిప్రాయంతో అమలు చేయాలని గుటెర్రస్ అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేశారు.

యోగికి అసమ్మతి సెగ

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం ఇవ్వడం లేదు. ఈ వైఖరి దళిత వర్గానికే అవమానకరం' అని దినేశ్ ఖటిక్ తన లేఖలో అసహనాన్ని వ్యక్తంచేశారు. ఆయన ఇప్పటికే తన అధికారిక నివాసాన్ని, వాహనాన్ని వదిలి హస్తినపూర్‌లోని సొంతింటికి వెళ్లిపోయారు. తన శాఖలో బదిలీలు, హస్తినపూర్‌లోని తన మద్దతుదారులపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదుతో కోపంగా ఉన్న దినేశ్‌ను బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

పీడబ్ల్యూడీ మంత్రి జితిన్ ప్రసాద కూడా రాజీనామా యోచనలో ఉన్నారు. యోగిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఆయన దిల్లీలో బీజేపీ పెద్దలతో మంతనాలకు యత్నిస్తున్నారు. తన శాఖలోని అధికారి, ఓఎస్‌డీ అనిల్ కుమార్ పాండే బదిలీ వ్యవహారం ఆయనకు కోపం తెప్పించింది. అయితే మంగళవారం అర్ధరాత్రి వరకు ఈ ఇద్దరు మంత్రుల ఫోన్లు అందుబాటులో లేకపోవడం, బుధవారం దినేశ్ రాజీనామా, అమిత్‌షా వద్ద పంచాయితీకి జితిన్ ప్రసాద యత్నాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ ఆకస్మిక పరిణామాలతో ఉత్తరప్రదేశ్ మంత్రుల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు, వారిని బుజ్జగించేందుకు ప్రయత్నాలను బీజేపీ అధిష్టానం మొదలు పెట్టిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అసంతృప్తి నేతలకు దిల్లీ నుంచి త్వరలోనే పిలుపు రానున్నట్లు తెలుస్తోంది.

మూసేవాలా హంతకుల ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధూ మాన్సా జిల్లాలోని తన స్వగ్రామానికి వెళ్తుండగా..కొందరు అడ్డగించి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సిద్ధూ అక్కడికక్కడే మృతిచెందారు. ముఠా కక్షల కారణంగానే ఈ ఘటన జరిగినట్లు అనుమానిస్తున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. సిద్ధూ హత్య వెనుక గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ హస్తం ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. ఈ కేసులో ఇప్పటివరకు చాలామందిని అరెస్టు చేశారు.

శ్రీలంక కొత్త సారథి విక్రమసింఘె

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగుతున్నారు. ఈ క్రమంలో కొత్త నాయకత్వం కోసం బుధవారం పార్లమెంట్‌లో ఓటింగ్ జరిగింది. ఆ రేసులో రణిల్‌తో పాటు మరో ఇద్దరు పోటీలో నిలిచారు. అధికార పార్టీ శ్రీలంక పొదుజన పెరమున (ఎస్ఎల్‌పీపీ) వర్గానికి చెందిన దులస్ అలహాప్పెరుమాతో పాటు వామపక్ష పార్టీ జనతా విముక్తి పెరమున నాయకుడు అనూర కుమార దిశనాయకే పోటీ చేశారు. అయితే ప్రధాన ప్రతిపక్ష పార్టీ సమాగి జన బలవేగాయ (ఎస్‌జేబీ) నాయకుడు సాజిత్ ప్రేమదాస.. అలహాప్పెరుమాకు మద్దతు ప్రకటించారు. దాంతో మొదట్లో దులస్‌కే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దాంతో ఇద్దరి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. చివరకు 134 ఓట్లతో రణిల్‌కే విజయం దక్కింది. శ్రీలంకలో మొత్తం 225 స్థానాలున్నాయి. మెజార్టీ మార్కు కోసం కావాల్సిన సంఖ్య 113.

దేశం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది: రణిల్

శ్రీలంక అధ్యక్ష పదవికి ఎన్నికైన తర్వాత రణిల్ పార్లమెంట్‌లో మాట్లాడారు. 'దేశం తీవ్ర సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోంది. మన ముందు పెను సవాళున్నాయి'అని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ ద్వీపదేశం నిత్యావసరాలు తీర్చుకోలేని స్థితిలో అల్లాడిపోతోంది. దీన్నుంచి బయటపడేందుకు అంతర్జాతీయ ద్రవ్యనిధితో చర్చలు జరుపుతోంది.

ఆగని ఆందోళనలు..

కొత్త అధ్యక్షుడి ఎన్నిక పూర్తైనా.. ఈ ద్వీప దేశంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. రణిల్ ఎన్నికపై ఆందోళనకారులు మండిపడ్డారు. అధ్యక్ష కార్యాలయం వెలుపల పెద్ద సంఖ్యలో గుమిగూడి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అన్ని కేసుల్లో జుబేర్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

విచారణలకు హాజరుపర్చడం సమర్థనీయం కాదని పేర్కొంది. దిల్లీ పోలీసుల విచారణకు ఆయన పూర్తిగా సహకరించారని తెలిసిన తర్వాత.. ఆయన స్వేచ్ఛను హరించేందుకు కారణం కనిపించడం లేదని జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అయితే జుబేర్ ట్వీట్ చేయకుండా నిరోధించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కోర్టును కోరింది. దీనిపై కోర్టు మండిపడింది. మీరు చేసే వాదన..న్యాయవాది ఇంకా వాదించవద్దు అన్నట్లు ఉందని, జర్నలిస్టును రాయవద్దని ఎలా చెప్పగలరని ప్రశ్నించింది. ఒకవేళ చట్టాన్ని ఉల్లంఘించే చర్యలకు జుబేర్ పాల్పడినట్లయితే.. చట్టానికి జవాబుదారీగా ఉంటాడని పేర్కొంది. తన స్వరాన్ని పెంచుతున్నాడని భావించి ఓ వ్యక్తిపై ముందస్తు చర్యలు తీసుకోగలమా, ప్రతి పౌరుడు బహిరంగంగా లేదా ప్రైవేటుగా చేసే పనులకు జవాబుదారీగా ఉంటాడని, కాబట్టి అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. 2018లో ఓ ట్వీట్ అనుచితంగా ఉందంటూ గత నెల 28న దిల్లీ పోలీసులు అరెస్టు చేసిన సంగతి విదితమే. ఈ కేసులో బెయిల్ మంజూరు కాగా, ఉత్తరప్రదేశ్‌లోని తొమ్మిది ప్రాంతాల్లో ఆయనపై కేసులు నమోదయ్యాయి.

ఏపీ హైకోర్టుకు ఏడుగురు జడ్జీలు

(మొదటిపేజీ తరువాయి)

జరగడం, హైకోర్టులో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడనుంది.

మొత్తం 21 మందికి పదోన్నతి

న్యూదిల్లీ: దేశంలోని వేర్వేరు హైకోర్టుల్లో న్యాయమూర్తులుగా 21 మంది న్యాయాధికారులకు పదోన్నతులు కల్పించేందుకు కొలీజియం సిఫార్సు చేసింది. జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్‌తో కూడిన కొలీజియం తమ సిఫార్సులను ప్రభుత్వానికి పంపింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఏడుగురి పేర్లు ప్రతిపాదించగా అలహాబాద్ హైకోర్టుకు ప్రతిపాదించిన తొమ్మిది మందిలో రేణు అగర్వాల్, మహమ్మద్ అజర్ హుస్సేన్ ఇద్రీసి, రామ్‌మనోహర్ నారాయణ్ మిశ్రా, జ్యోత్స్న శర్మ, మయాంక్ కుమార్ జైన్, శివశంకర్ ప్రసాద్, గజేంద్ర కుమార్, సురేంద్ర సింగ్-1, నలిన్ కుమార్ శ్రీవాత్సవ ఉన్నారు.

కర్ణాటక హైకోర్టు కోసం ప్రతిపాదించిన ఐదుగురిలో అనిల్ భీమ్‌సేన్ కట్టి, గురుసిద్ధయ్య బసవరాజ, చంద్రశేఖర్ మృత్యుంజయ జోషి, ఉమేశ్ మంజునాథ్ భట్ అడిగ, తల్కాడ్ గిరిగౌడ శివశంకర గౌడ ఉన్నారు. కొలీజియం తాజా సిఫార్సులను సర్వోన్నత న్యాయస్థానం వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

గోదావరి వరదలు జాతీయ విపత్తు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతి ఇంటికి వెళ్లాలని నాయకులకు చెబుతున్నారన్నారు. బీజేపీ వ్యతిరేక ఉద్యమాలను బలోపేతం చేస్తూ అక్టోబర్ 14,15 తేదీల్లో సీపీఐ జాతీయ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ 20, 21 తేదీల్లో ఉభయ గోదావరి జిల్లాల్లోని వరద బాధిత ప్రాంతాల్లో సీపీఐ నారాయణతో పాటు రాష్ట్ర బృందం పర్యటన పర్యటన చేస్తోందన్నారు. పర్యటనలో భాగంగా ఏపీ రైతు సంఘం జాతీయ నాయకులు కామ్రేడ్ రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జీ ఓబులేసు, సీపీఐ నాయకులు పర్యటిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కే రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నల్ల రామారావు, జిల్లా సమితి సభ్యులు సప్పా రమణ, బొమ్మసాని రవిచంద్ర, ఎస్ సూరిబాబు, కిర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

కాకినాడ/బడుగువాయలంక : వర్షాల కారణంగా గోదావరి లంక గ్రామాలు నీట మునగడంతో అల్లాడుతున్న ప్రజలను పరామర్శించేందుకు సిపిఐ రాష్ట్ర బృందం, ఆ పార్టీ జాతీయకార్యదర్శి డాక్టర్ కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య, జి ఓబులేసు, తాటిపాక మధు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు అధ్వర్యంలో జిల్లాలో పలు లంక గ్రామాల్లో పర్యటించారు. తీవ్రంగా నష్టపోయిన మిర్చి, బెండ, బీరకాయ, అరటి పంట పొలాలను పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులను అడిగి పంటనష్టాన్ని తెలుసుకున్నారు. అదేవిధంగా కొద్దిసేపు పడవలో ప్రయాణించి లంక గ్రామం చేరుకుని బాధితుల గోడు విన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సహాయ కార్యదర్శి బి రాము, కోనసీమ జిల్లా నాయకులు రామకృష్ణ, శామ్యూల్, కర్రీ రామిరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ముక్కామల పవన్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సహాయం అందించాలి

ఆలమూరు : గోదావరి వరదల వలన నష్టం వాటిల్లిన అందరికీ వరద సహాయం అందించాలని నారాయణ కోరారు. కోనసీమ జిల్లా ఆలమూరు మండలం బడుగువానిలంకలోని వరద బాధితులను పరామర్శించారు. అనంతరం గ్రామానికి చేరుకున్న ఆయనకు మెగా, జనసేన అభిమానుల సెగ తగిలింది. లంక ప్రాంతంలో బాధితులను ఆయన పరామర్శించారు.

పోర్టుతో ఎంతో మేలు

(మొదటిపేజీ తరువాయి)

పోర్టు నిర్మాణానికి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ పోర్టువల్ల వచ్చే పరిశ్రమల్లో, పోర్టులో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలని చట్టం చేసిన ప్రభుత్వం తమదేనన్నారు. రాష్ట్రంలో ఆరు పోర్టులు ఉన్నా ఒక విశాఖపట్నం మినహాయించి మిగిలిన పోర్టుల కెపాసిటీ 158 మిలియన్ టన్నులు ఉంటే విశాఖపట్నంలో 70 మిలియన్ టన్నులు సామర్థ్యం కలిగి ఉందన్నారు. రాష్ట్రంలో సముద్రతీర ప్రాంతాలను అభివృద్ధి చేయడం వలన లక్షలాది మంది గంపుత్రులు తమ దగ్గర ఉన్న పోర్టుల్లోనే ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. గతంలో మత్స్యకారులు ముంబై, చెన్నై వంటి మహానగరాలకు ఉద్యోగాలకు వెళ్లేవారని, నేడు ఆ పరిస్థితి లేకుండా రాష్ట్రంలోనే వారికి ఉపాధి కల్పించే దశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రామయపట్నం పోర్టు అభివృద్ధి రూ.3700 కోట్లు, 850 ఎకరాల భూమిని పూర్తిగా సేకరించి పోర్టు ద్వారా 4 బెర్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇక్కడనుంచే పోర్టును ప్రారంభిస్తామని, తొలిదశలో 4 బెర్తులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు సహకారమందించిన ఆవులవారిపాళెం, రావూరు, చేవూరు, సాలిపేట, కర్లపాలెం, బొండివానిపాళెం గ్రామస్తులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. వారిచ్చిన భూముల వల్లనే ఈ పోర్టు ఏర్పడుతోందన్నారు. ఈ సభలో ఎమ్మెల్యేలు మహీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, కలెక్టర్ చక్రధర్‌బాబు తదితరులు ప్రసంగించగా, అమర్‌నాథ్‌రెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు అనిల్, ప్రసన్న, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, మధుసూదన్ యాదవ్, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు, నెల్లూరు జిల్లాల జడ్పీ ఛైర్మన్‌లు ఆనం అరుణమ్మ, బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణచక్రవర్తి, తూమాటి మాధవరావు, వాకాటి నారాయణరెడ్డి, నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, డీఐజీ త్రివిక్రమ్‌వర్మ, ఎస్‌వి విజయరావు, రామాయపట్నం పోర్టు అథారిటీ ఎండీ ప్రతాప్‌రెడ్డి, జీఎం నరసింహారావు పాల్గొన్నారు.

సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంటులోనే అవాస్తవాలు మాట్లాడుతున్నారు. విశాఖ రైల్వే జోన్ అమలుకు నోచుకోలేదు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు ఇవ్వలేదు. రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీ చేయలేదు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఊసే లేదు. విభజన చట్టంలో పొందుపరచినట్లుగా రామాయపట్నంలో పోర్టు ఏర్పాటు చేయకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అక్కడ చిన్న పోర్టుకు శంకుస్థాపన చేశారు. అధికారం చేపట్టాక చేతులెత్తేశారు. దాని పర్యవసానంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని, ఇచ్చేది లేదని పదేపదే నిర్భయంగా చెబుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు అందరూ లోతుగా ఆలోచించాలి. రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతీయ పార్టీలైన వైసీపీ, టీడీపీ, జనసేన మోదీపై ఒత్తిడి తేలేకపోతున్నాయి. గతంలో పాచిపోయిన లడ్డూలంటూ అగ్రహం వ్యక్తం చేసిన పవన్ కళ్యాణ్‌గానీ, గతంలో ముఖ్యమంత్రిగా ఉండి దిల్లీలో ధర్నా చేసిన చంద్రబాబు నాయుడుగానీ ఏపీకి కేంద్రం చేసిన అన్యాయంపై ఏమాత్రం నోరుమెదపడం లేదు. ఇక ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా 25 మంది వైసీపీ ఎంపీలను గెలిపిస్తే 'కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తీసుకువస్తానని ఇప్పుడు నరేంద్ర మోదీ దగ్గర సాగిలపడ్డారు. కేంద్రం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలకు వత్తాసు పలుకుతున్నారు. ఈ వైఖరిని తీవ్రంగా తప్పుబడుతున్నాం. ఈ నేపథ్యంలో ఏపీకి ప్రత్యేక హోదా సాధన కోసం రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు కలిసిరావాలి. ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచితేనే ఏపీకి న్యాయం జరుగుతుంది. ఆ విధంగా సమైక్య పోరాటానికి సిద్ధం కావాలని రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

కేంద్ర వైఖరిని ఖండించిన 10 వామపక్షాలు

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు గత 8 సంవత్సరాలుగా ఆందోళన చేస్తుండగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక హోదా నిరాకరిస్తూ పార్లమెంటులో మళ్లీ ప్రకటన చేయడాన్ని 10 వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను ఇవ్వడం కుదరదని మరోసారి చెప్పడం గర్హనీయం. 2014లో ఇచ్చిన హామీలు చాలా వరకు అమలు చేశామని, మిగతా కొన్ని అంశాలు అమలులో ఉన్నాయని చెప్పడం రాష్ట్ర ప్రజలను మోసగించడమే. కేంద్ర ప్రభుత్వం అడ్డగోలు సమాధానాలు చెబుతున్నా రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీ పల్లెత్తు మాట మాట్లాడడం లేదు. పైగా బీజేపీ విధానాలకు నిస్సిగ్గుగా మద్దతు ప్రకటించారు. రాష్ట్రం పై వివక్ష, మోసపూరిత వైఖరిని, కేంద్రం పై రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు అనుసరిస్తున్న వైఖరిని ప్రజలు నిరసించాలని కోరారు. ప్రకటనపై కె.రామకృష్ణ (సీపీఐ), వి.శ్రీనివాసరావు (సీపీఎం), వై.సాంబశివరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సీపీఐ ఎంఎల్) న్యూడెమోక్రసీ, కాటం నాగభూషణం (ఎంసీపీఐ(యు), ఎన్.మూర్తి (సీపీఐ ఎంఎల్) లిబరేషన్, పీవీ సుందరరామరాజు (ఫార్వర్డ్‌బ్లాక్), జానకిరాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) సంతకాలు చేశారు.

చర్చకు భయమెందుకు?

న్యూదిల్లీ: ధరల పెరుగుదల, నిత్యావసరాలపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధింపుపై ప్రతిపక్ష పార్టీల నిరసనలతో పార్లమెంట్ మరోసారి దద్దరిల్లింది. సమావేశాల మూడు రోజు బుధవారం కూడా ఉభయ సభల్లోనూ విపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ అంశంపై తక్షణమే చర్చ చేపట్టాలని డిమాండ్ చేశాయి. దీంతో రాజ్యసభ, లోక్‌సభ కార్యకలాపాలు స్తంభించాయి. ధరల పెరుగుదల, నిత్యావసరాలపై జీఎస్‌టీ విధించడంపై కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీల నిరంతర నిరసనల మధ్య రాజ్యసభ కార్యకలాపాలు ఉదయం వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం సభ తిరిగి ప్రారంభమైన వెంటనే డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ భారీ విధ్వంస ఆయుధాలు, పంపిణీ వ్యవస్థల (చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నిషేధం) సవరణ బిల్లు, 2022పై ప్రసంగించవలసిందిగా కాంగ్రెస్ సభ్యుడు శక్తిసిన్హ్ గోహిల్‌ని కోరారు. ఇదే సమయంలో విపక్ష సభ్యులు సభలో తమ నిరసనలు, నినాదాలను కొనసాగించారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పదే పదే కోరినప్పటికీ, కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో తిరిగి తమ స్థానాలకు వెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలో రణదీప్ సింగ్ సూర్జేవాలా సభలో ఫోటోలు తీయడాన్ని కూడా గమనించి, నిబంధనలకు విరుద్ధమని, అలా చేయవద్దని కోరారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ కూడా కొందరు సభ్యులు ఫోటోలు తీస్తున్నారని ఎత్తి చూపారు. బిల్లుపై మాట్లాడుతూ గోహిల్‌ని డిప్యూటీ ఛైర్మన్ గుర్తించకపోవడంతో, దానిపై మాట్లాడవలసిందిగా మరో సభ్యుడు పి.విల్సన్‌ను పిలిచారు. అయితే సభను నియంత్రణలోకి తీసుకురావాలని విల్సన్ కోరగా, బిల్లుపై మాట్లాడేందుకు బీజేడీ సభ్యుడు ప్రశాంత నందను పిలిచారు. అనంతరం విల్సన్ బిల్లుపై మాట్లాడేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అయితే అంతలోనే సభను గురువారానికి వాయిదా వేశారు. మధ్యాహ్న భోజనానికి ముందు జరిగిన సెషన్‌లో కూడా ధరల పెరుగుదల, నిత్యావసరాలపై జీఎస్‌టీ విధించడంపై ప్రతిపక్షాలు నిరసనలు కొనసాగించడంతో సభలో అంతరాయం ఏర్పడింది. ధరల పెరుగుదల అంశంపై చర్చకు అనుమతినిచ్చామని ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు చెప్పగా, ఆ రోజు అజెండాను పక్కనపెట్టి తక్షణమే చర్చ జరపాలని విపక్షాలు పట్టుబట్టాయి. జులై 18 నుంచి 5 శాతం జీఎస్‌టీ పరిధిలోకి వచ్చిన పాలు, పెరుగు ప్యాకెట్లను పట్టుకుని ప్రతిపక్ష సభ్యులు సభ వెల్‌లోకి దూసుకెళ్లడంతో వెంకయ్య నాయుడు సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. జాబితా చేయబడిన అంశాలను టేబుల్‌పై ఉంచిన వెంటనే, 267 నిబంధన కింద నోటీసు ఇచ్చిన విషయాన్ని క్లుప్తంగా ప్రస్తావించడానికి ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేని అనుమతించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, వంట గ్యాస్ ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో నిత్యావసర వస్తువులైన గోధుమలు, బియ్యం, పిండి, పెరుగు వంటి వాటిపై జీఎస్‌టీ భారం పడిందని, దీంతో సామాన్యులపై భారం పడిందని ఖర్గే అన్నారు. జాబితా చేసిన అజెండాను పక్కనపెట్టి, లేవనెత్తుతున్న సమస్యను చేపట్టాలని పిలుపునిచ్చే రూల్ 267 నోటీసును ఆమోదించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టడంతో ఛైర్మన్ వెంకయ్య నాయుడు 'మీరు నన్ను ఆదేశించలేరు' అని అన్నారు. 'బీఏసీలో మనం తప్పనిసరిగా చర్చ జరపాలని సూచించింది. ధరల పెరుగుదలపై చర్చకు నేను అంగీకరించాను. కానీ మీరు అది కోరుకోరు' అని నాయుడు సమావేశాన్ని మధ్యాహ్నం వరకు వాయిదా వేసే ముందు చెప్పారు. సభ వాయిదా తర్వాత కొంతమంది ప్రతిపక్ష ఎంపీలు పాలు, పెరుగు, మజ్జిగ ప్యాకెట్లను పట్టుకుని 'జీఎస్‌టీని రద్దు చేయండి' అని నినాదాలు చేస్తూ వెల్‌లో కనిపించారు.

నిరసనల మధ్య లోక్‌సభ వాయిదా

ధరల పెరుగుదల, జీఎస్‌టీ అంశాలను వెంటనే చర్చించాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు ఆందోళనలు కొనసాగించడంతో లోక్‌సభ కార్యకలాపాలకు మూడవ రోజు కూడా అంతరాయం ఏర్పడింది. బుధవారం ఉదయం సభ సమావేశమైనప్పుడు, జీరో అవర్‌లో సమస్యలను లేవనెత్తడానికి అవకాశం ఇస్తానని స్పీకర్ ఓం బిర్లా నిరసన వ్యక్తం చేసిన సభ్యులతో అన్నారు. 'ఈ సభ చర్చల కోసమే తప్ప నినాదాలు చేయడం కోసం కాదు. ఈ రకమైన ప్రవర్తన సభకు తగినది కాదు. సభ్యులు అనుసరించాల్సిన ప్రక్రియ ఉంది' అని స్పీకర్ అన్నారు. సమస్యలు లేవనెత్తడానికి అనుమతిస్తామని స్పీకర్ హామీ ఇచ్చినప్పటికీ సభ్యులు సభ వెల్‌లోకి ప్రవేశించి నిరసన తెలపడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. గందరగోళం కొనసాగుతుండగా, స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అయితే సభ మళ్లీ సమావేశమైనప్పుడు ప్రతిపక్షాలు తమ నిరసనలను కొనసాగించాయి. అనంతరం సభ సాయంత్రం 4 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభం కాగానే గందరగోళం మధ్య కొందరు సభ్యులు మాట్లాడిన తర్వాత సభను రోజంతా వాయిదా వేశారు.

ప్రసూతి మరణాల్లో భారత్ నం.2

70శాతం జిల్లాల్లో అధికం

తాజా అధ్యయనం వెల్లడి

న్యూదిల్లీ: ప్రసూతి మరణాల్లో ప్రపంచంలోనే రెండవ స్థానంలో భారతదేశం ఉందని తాజా అధ్యయనం తేల్చింది. మొదటిస్థానంలో ఆఫ్రికా దేశం నైజీరియా ఉన్నట్లు వెల్లడించింది. భారత్‌లోని 70శాతం జిల్లాల్లో ప్రసూతి మరణాలు ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి నిర్దేశిత లక్ష్యాన్ని మించిపోయినట్లు పేర్కొంది. భారత్‌లోని 640జిల్లాలకుగాను 448 జిల్లాల్లో ప్రసూతి మరణాల నిష్పత్తి (ఎంఎంఆర్) ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) లక్ష్యం కంటే అధికంగా ఉందని అధ్యయనం తెలిపింది. ప్రసూతి మరణాలను జిల్లాల స్థాయిలో మ్యాపింగ్ చేయడం ఇదే మొదటిసారి కాగా తద్వారా వెల్లడైన వివరాలలో నివేదికను పీఎల్ఓఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్ జర్నల్ ప్రచురించింది. దీని ప్రకారం మహారాష్ట్రలో అతితక్కువ ఎంఎంఆర్ ఉంటే అరుణాల్ ప్రదేశ్ పరిస్థితి అధ్వాన్నమని పేర్కొంది. 2017-19 ఆరోగ్య నిర్వహణ సమాచార వ్యవస్థ (హెచ్ఎంఐఎస్)లో 61.9 మిలియన్ల జననాలు, 61,169 ప్రసూతి మరణాలు నమోదు అయినట్లు శాస్త్రవేత్తల విశ్లేషణ చెబుతోంది. హెచ్ఎంఐఎస్ అన్నది వెబ్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థ. ఇది ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోనిది. 2011 జనగణన డేటాను వినియోగించిన క్రమంలో 773కిగాను 640 జిల్లాలను మాత్రమే అధ్యయనం కోసం పరిగణనలోకి తీసుకున్నారు. 640కిగాను 448 జిల్లాలు అంటే 70శాతం జిల్లాల్లో 70కిపైగా ప్రసూతి మరణాలు సంభవించాయి. ఇది సుస్థిరాభివృద్ధి లక్ష్యం కంటే ఎక్కువ అని అధ్యయనకర్తలు వెల్లడించారు. ఐరాస ఎస్‌డీజీ ప్రకారం 2030 నాటికి ఎంఎంఆర్ లక్ష్యం 70గా ఉంటే భారత్‌లో ప్రస్తుతం అంతకుమించిపోయి 113 మరణాలు సంభవిస్తున్నాయి. దీంతో ప్రపంచంలో సంభవించే ప్రసూతి మరణాల్లో 15శాతం భారత్‌లో నమోదు అవుతున్నాయి. దీంతో ప్రపంచ దేశాల్లో ఎంఎంఆర్ జాబితాలో భారత్‌ది రెండవ స్థానం కాగా 19శాతంతో నైజీరియా మొదటిస్థానంలో ఉంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎంఎంఆర్ అత్యధికంగా 284గా ఉంటే మహారాష్ట్రలో అత్యల్పంగా 40గా ఉందని ముంబైలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్; బ్రిటన్‌కు చెందిన పోర్ట్స్‌మౌత్ యూనివర్సిటీ, వెస్టరన్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి అయింది. మణిపూర్‌లో ఎంఎంఆర్ 282గా ఉండగా అండమాన్, నికోబార్ దీవుల్లో 275గా, మేఘాలయలో 226గా, సిక్కింలో 228గా, నాగాలాండ్, పంజాబ్‌లో 143 చొప్పున, చత్తీస్‌గఢ్‌లో 144గా, జమ్మూకశ్మీర్‌లో 151గా, దిల్లీ-రాజస్థాన్‌లో 162 చొప్పున, బీహార్‌లో 164గా, మధ్యప్రదేశ్‌లో 179గా, లక్షద్వీప్- ఉత్తరప్రదేశ్‌లో 208 చొప్పున, అసోంలో 209గా ఉంది. తొమ్మిది రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంఎంఆర్ 140-209 మధ్య ఉంది. భారత్‌లోని నమూనా నమోదు వ్యవస్థ (ఎస్ఆర్ఎస్) తాజా అంచనాల ప్రకారం ఎంఎంఆర్‌లో గణనీయమైన తగ్గుదల నమోదు అయింది. 1,00,000 జననాల లెక్కన ఎంఎంఆర్ 130కుగాను 113కు తగ్గిందని అధ్యయనం పేర్కొంది. ప్రతి ఏడాది సగటున 4.5శాతం మేర తగ్గుదల ఎంఎంఆర్‌లో నమోదు అవుతుందని, ఎస్‌డీజీ-3 నిర్దేశిత లక్ష్యం క్రమంలో వార్షిక రేటు 5.5శాతమని వెల్లడించింది. అరుణాచల్ ప్రదేశ్‌లోని తిరప్ జిల్లాలో అధికంగా ఉంటే హిమాచల్ ప్రదేశ్‌లోని కిన్నౌర్, లాహౌల్-స్పితి జిల్లాల్లో అత్యల్పంగా ఉన్నట్లు తెలిపింది. మొత్తం 115 జిల్లాల్లో ఎంఎంఆర్ 210 కంటే ఎక్కువగా లేక అందుకు సమానంగా ఉందని, 125 జిల్లాల్లో 140-209 మధ్య ఉందని; 210 జిల్లాల్లో 70-139మధ్య ఉందని; 190 జిల్లాల్లో 70 కంటే తక్కువగా ఉందని వెల్లడించింది. అయితే తమ ఈ అధ్యయనం ఆధారంగా ఎంఎంఆర్ 'హాట్‌స్పాట్లు' గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత వర్గాలకు శాస్త్రవేత్తలు సూచించారు.

ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలి

సత్వరమే వేతన ఒప్పందం అమలు చేయాలి

కేంద్ర ఉక్కు మంత్రిని కలిసిన పోరాట కమిటీ

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: ఉక్కు కార్మిక సంఘాల నేతలు, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్య నారాయణ నాయ కత్వంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధి యాను బుధవారం దిల్లీలో తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉక్కు శాఖ మంత్రిగా నియ మితులైనందుకు సింధియాకు అభినందనలు తెలియజేసి ఆయన నాయకత్వంలో ఉక్కు పరిశ్రమ కొత్త పుంతలు తొక్కాలని లాభాల బాటలో పయనించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం విశాఖ ఉక్కు లాభాల బాటలో పయని స్తోందని తెలిపారు. ప్రస్తుతం తాము తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని, కొత్త వేతన ఒప్పందం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి మాట్లాడుతూ తాను త్వరలోనే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సందర్శిస్తానని, అన్ని కర్మాగారాల్లా కాకుండా దీని చరిత్రను అధ్యయనం చేసి మంచి నిర్ణయం తీసుకుంటానని, వేతన ఒప్పందం తొందర్లోనే అములయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. గుర్తింపు సంఘం నాయకులు డీ ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జే రామకృష్ణ, హెచ్ఎంఎస్ నాయకులు గణపతిరెడ్డి విశాఖ ఉక్కు కార్మిక సంఘ నాయకులు మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎంపీలు మౌనం విడాలి

ఏపీ ఎంపీలు మౌనం విడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద 524వ రోజు జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి ఆర్.ఎం.హెచ్.పి, ఎసీవీఎస్, హెచ్.ఆర్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు. వీరిని ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు ఎన్ రామారావు మాట్లాడుతూ కేంద్రం మరోసారి పార్లమెంట్ సాక్షిగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రకటించారన్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఎంపీలు మౌనం వీడి తమ అసం తృప్తిని తీవ్ర స్వరంతో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పేదలు తినే ఆహార పదార్థాలపై కూడా జీఎస్టీ విధించడాన్ని తప్పుబట్టారు. విశాఖ ఉక్కుతో గాజువాక నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన నియోజకవర్గంగా గుర్తింపు సాధించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఈనెల 22న ఉక్కు ప్రధాన పరిపాలన భవనాన్ని ముట్టడించడం కోసం ప్లాంట్‌లో వివిధ విభాగాల్లో ఇప్పటికే సన్నాహకాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ నిరసన కార్యక్ర మాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. పోరాట కమిటీ నాయకులు మురళి రాజు మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థ నిర్ణయాలతో నేడు ఈ కర్మాగారం నిర్వీర్యం అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షా శిబిరంలో ఆర్‌హెచ్ ప్రతినిధులు డీసీహెచ్ వెంకటేశ్వర రావు, జయ, బీ ఎన్ రాజు, శ్రీనివాస్, సువర్ణ రత్నం, యు అప్పలరాజు, డీఎస్‌వీఎస్ శ్రీపువాస్‌రావు, ఎం. దానయ్య, అంజి, జగన్, రవికుమార్, తదితరులతోపాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర కమిటీ మోసపూరితం

ఏఐకేఎస్, రైతు సంఘం విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కనీస మద్దతు ధరల అంశాన్ని పరిశీలిం చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కమిటీ మోసపూరిత కమిటీగా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కె.వి.వి.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 2021 నవంబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రైతు చట్టాలను వెనక్కు తీసుకుంటున్నట్లు స్వయంగా ప్రకటించి దేశ ప్రజలకు, రైతాంగానికి క్షమాపణలు చెప్పారు. కనీస మద్దతు ధరల చట్టాన్ని తెచ్చేందుకు కమిటీ వేస్తామని, చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 8 నెలల అనంతరం వేసిన కమిటీని చూస్తే కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేని స్పష్టమవుతుందని తెలిపారు. కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ డిమాండ్‌తో సంవత్సర కాలంపైగా దిల్లీ సరిహద్దుల్లో, దేశవ్యాప్తంగా రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రధాని ప్రకటన అనంతరం కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వక హామీతో రైతు సంఘాలు ఆందోళనలు విరమించాయి. ప్రభుత్వం ప్రకటించిన పేర్లు గమనిస్తే చాలా గొప్పగా ఉన్నాయని, అయితే వారిలో అత్యధికులు సాగు చట్టాలను సమర్థించినవారేని, రైతు ప్రతినిధుల భాగస్వామ్యం కూడా అతి తక్కువని తెలిపారు. ఈ కమిటీ మోసపూరితంగా ఉందని, కనీస మద్దతు ధరకు చట్ట రూపం తెచ్చే యోచన లేదన్నది స్పష్టమవుతోందని తెలిపారు. మరోపక్క, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తోమర్ తాము మద్దతు ధరల చట్టం చేస్తామని హామీ ఇవ్వలేదని పార్లమెంటులో ప్రస్తావించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. తోమర్ ప్రకటన అత్యంత నిస్సిగ్గుగా, దేశవ్యాప్తంగా రైతాంగాన్ని వంచించేదిగా ఉన్నదని తెలిపారు. రైతుల ప్రధాన డిమాండ్ అయిన మద్దతు ధరల చట్టం అమలు చేసే పద్ధతుల్లో ఈ కమిటీ వ్యవహరిస్తుందన్న విశ్వాసం, నమ్మకం రైతాంగానికి లేదన్నారు. ప్రస్తుత కమిటీ అసలు సమస్యలను పక్కనపెట్టి ఇతరత్రా అంశాలను చర్చిస్తామంటూ ప్రకటించడం మరింత దుర్మార్గమని అన్నారు. సాగు చట్టాలను తిరిగి మరో రూపంలో తీసుకువచ్చే కుట్రలో భాగమే ఈ కమిటీ అని రైతు సంఘాలతో కూడిన సమన్వయ సమితి పేర్కొంది. కనీస మద్దతు ధరకు చట్ట రూపం తేవాలనే ప్రతిపాదన ప్రభుత్వానికి ఏమాత్రం లేదన్నది స్పష్టంగా తెలుస్తోందని, మోసపూరిత కమిటీలో రైతు సంఘాలు చేరకూడదని, మద్దతు ధరల అంశం మాత్రమే చర్చించేలా కమిటీ నిర్ణయించాలని, లేని పద్ధతుల్లో తిరిగి ఆందోళనకు సన్నద్ధం కావాలని రైతు సంఘాల సమన్వయ సమితి నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని రైతు సంఘాలు, రైతులు, రైతు శ్రేయోభిలాషులు అందరూ మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని, కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరికి నిరసనగా ఆందోళనలకు సమాయత్తం కావాలని వారు రైతాంగానికి పిలుపునిచ్చారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి

మాట్లాడుతున్న హరినాథరెడ్డి, పక్కన కుమార్, కాలేషా, చంద్రయ్య, నారాయణ, ఇన్సాఫ్ తదితరులు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణం లోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బుధవారం నిర్వహించిన సీపీఐ నియోజకవర్గ మహాసభలు విజయవంతమయ్యాయి. ఈ మహా సభలకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఐక్యంగా ఎండగట్టాలన్నారు. పెట్రో, డీజిల్ ధరల పెంపుతో దేశ వ్యాప్తంగా నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. జీఎస్టీతో పారిశ్రామిక రంగం కుదేలైందన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో దళితులు, మైనారిటీలపై దాడులు అధికమయ్యాయన్నారు ప్రజల నుంచి పెల్లు బుకుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకు నేందుకు, దృష్టి మరల్చేందుకు దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి వివాదాలను ప్రోత్సహిస్తోందని కేంద్ర ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. వీటన్నింటికీ ఏకైక పరిష్కారం కమ్యూనిజమన్నారు. దేశంలో వామపక్షాలు ఉనికిని కోల్పోతున్నారని కొంతమంది కార్పొరేట్ రాజకీయ నాయకుల వాదనలో వాస్తవం కాదన్నారు. పేదలు ఉన్నతంగా ఎదిగేంత వరకూ కమ్యూనిజం ప్రపంచ వ్యాప్తంగా సజీవంగా ఉంటుందని నాయకుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో దామోదరం సంజీవయ్య పవర్ ప్లాంట్‌ను అదానీకి అప్పనంగా అందిస్తుంటే జిల్లాలో మంత్రులు, పది నియోజకవర్గాల ఎమ్మెల్యేలు చేతులు ముడుచుకుని కూర్చున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు, ఆగస్టులో వైజాగ్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్ మాట్లాడుతూ సమష్టి పోరాటాలతో హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సీవీఆర్ కుమార్, పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, ఏఐటీయూసీ నాయకులు ఎంబేటి చంద్రయ్య, కే నారాయణ, ఇన్సాఫ్ నాయకులు ఎండీ అన్వర్ బాష, షేక్ జమాలుల్లా, చాన్ బాష, యస్థాని భాయ్, ఇలియాజ్, నశీర్, రాహుల్, ఫారూఖ్, జమీల్, ఖాజా రహంతుల్లా, శ్రీను రెడ్డి, శీనయ్య, ప్రజానాట్యమండలి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చట్ట సవరణతో పేదోడి జేబుకు చిల్లు

ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో పెట్టబోయే విద్యుత్ చట్ట సవరణ బిల్లు పేదవాడి జేబుకు చిల్లుపడుతుందని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ హెచ్ 64 (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బండి రామలింగారెడ్డి, పొన్నా శివయ్య బుధవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమైన ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు ఈ సమావేశాల్లో ఆమోదం పొందితే పేదవాడికి విద్యుత్ అందని ద్రాక్షగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడమే కాకుండా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదన్నారు. అందువల్ల ఈ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టక ముందే దేశంలో ఉన్న కార్మికులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని, జాతి సంపదను కాపాడుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

తుప్పల్లో పసికందు

విశాలాంధ్ర-అరకులోయ/ అనంతగిరి: అనంతగిరి మండలం కోనాపురం గ్రామ పొలిమేర సమీపం తుప్పల్లో బుధవారం ఓ పసికందును స్థానికులు గుర్తించారు. వెంటనే అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సకాలంలో తరలించడంతో బిడ్డ క్షేమంగా ఉంది. ఈ హృదయ విషాదకరమైన దృశ్యం ప్రతి ఒక్కరిని కలచివేసింది. బిడ్డను వదిలించుకునే పరిస్థితులే తలెత్తితే తుప్పలు, చెత్తబుట్టల పాల్జేయకుండా పిల్లలు లేనివారికి అప్పగిస్తే ఆ బిడ్డ భవిష్యత్ బాగుంటుందని స్థానికులు తెలిపారు.

అమలు కాని హామీలపై

రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తాం

జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం: జగదీశ్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: అనంతపురం జిల్లా ప్రజల సమస్యల పరిష్కారానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అలుపెరుగని ఉద్యమాలు అనేకం చేపట్టిందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీశ్ అన్నారు. ఇప్పుడు కూడా జిల్లాకు ఇచ్చిన హామీల్లో అమలు కాని వాటి కోసం పోరాడుతుందని, వాటి అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విస్తృతంగా ఆందోళనలను చేపట్టబోతోందని తెలిపారు. సీపీఐ సాగించిన 50ఏళ్ల పోరాట ఫలితమే హంద్రీనీవా కెనాల్ అని ఆయన గుర్తుచేశారు. ఈనెల18,19 తేదీల్లో కళ్యాణదుర్గంలో జరిగిన 24వ సీపీఐ జిల్లా మహాసభల్లో ప్రవేశపెట్టిన 34 తీర్మానాలతో పాటు ఏక్రగీవంగా ఎన్నికైన జిల్లా కమిటీని జగదీశ్ బుధవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. హంద్రీనీవాకు సమాంతర కాలువ నిర్మించి పదివేల క్యూసెక్కుల కృష్ణాజలాలను మాల్యాల నుంచి జీడిపల్లి జలాశయానికి చేర్చేందుకు చర్యలు చేపడుతానని ఇచ్చిన హామీ, ఆ పనులకు నిధులు ఏమయ్యాయని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ప్రశ్నించారు. హంద్రీనీవా సామర్థ్యం పెంపుదల కోసం ఆగస్టు నుంచి ఆందోళనలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. జీడీపల్లి రిజర్వాయరు, భైరవానితిప్ప ప్రాజెక్టులను అనుసంధానం చేసి కళ్యాణ దుర్గం, కుందుర్పి, శెట్టూరు ప్రాంతాల్లో 176 చెరువులకు నీళ్లు ఇస్తామని రూ.960కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందిగానీ పనులను చేపట్టలేదన్నారు. ఈ పనులన్నింటినీ ప్రారంభించడమే కాకుండా పీఏబీఆర్ డ్యామ్ ద్వారా 50వేల ఎకరాలకు నీరిచ్చే క్రమంలో చెరువులకు కాకుండా పంట పొలాలకు నీటిని మళ్లించాలని డిమాండు చేశారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలో పరిశ్రమ స్థాపనకు భూసేకరణ చేశారేగాని పనులు ప్రారంభించలేదని, ప్లాస్టిక్ నిషేధం మాటలకే పరిమితమైందని దుయ్యబట్టారు. పర్యావరణానికి ఉపయోగపడే కార్యక్రమాలకు సీపీఐ మద్దతు ఉంటుందన్నారు. జిల్లాలో లక్షల టన్నుల బియ్యం. పప్పు దినుసులు నిల్వ సామర్థ్యంగల ఎఫ్‌సీఐ గోదాములను వెంటనే తెరిపించాలని డిమాండుచేశారు. ఇవి లేక అదనంగా డబ్బు వెచ్చించి మరోచోట రేషన్ బియ్యం నిల్వ ఉంచడం ద్వారా ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, వందలాది కార్మికులు రోడ్డున పడ్డారని జగదీష్ ఆందోళన వ్యక్తంచేశారు. జిల్లాలో వెబ్ ల్యాండ్ దందా జోరందుకుందని, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే రైతుల భూములు అధికార పార్టీ నేతల కబ్జాలకు గురవుతున్నాయని విమర్శించారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంగా ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సరైన వైద్యం అండడంలేదని, 750 పడకల ఏర్పాటు హామీ అమలు కాలేదన్నారు. 350 పడకలు మాత్రమే ఉండటంతో ఒకే మంచంపై ఇద్దరు రోగులు ఉండాల్సి వస్తోందని జగదీశ్ తెలిపారు. ఇటీవల జరిగిన వైసీపీ ప్లీనరీలో ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా తమ నియోజకవర్గాల ప్రస్తావన తేలేదని, ప్రజా సమస్యలపై చర్చ జరపలేదని అన్నారు. మూడేళ్లుగా ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని వారిని ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాతావరణ బీమాలో అన్నదాతలకు అన్యాయం జరుగుతోందని, కరువు పరిస్థితులకు అనుగుణంగా పంటబీమా ఉండాలని డిమాండు చేశారు. బీమాలో ఈ క్రాప్ సక్రమంగా లేదన్నారు. జిల్లా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు జగదీశ్ తెలిపారు.

నూతన కమిటీ : అనంతపురం జిల్లా నూతన కమిటీలో కార్యదర్శిగా జాఫర్, సహాయ కార్యదర్శులుగా నారాయణ స్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులుగా సంజీవప్ప, రాజారెడ్డి, కేశవరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, గోవిందు, నారాయణ స్వామి, రంగయ్య, గోపాల్, పద్మావతి, రమణయ్య, లింగమయ్య, మల్లికార్జున, చిరంజీవి, నాగార్జున, సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ ఆహ్వానితులుగా పెద్దయ్య, వీరభద్రస్వామి,రాజేష్, సాకే నాగరాజుతో పాటు 71 మంది కౌన్సిల్ సభ్యులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఆంధ్ర ప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం హనుమాన్ పేటలోని బూరాడ సీతారామయ్య భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకటసుబ్బయ్య హాజరై ప్రసంగించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భవన నిర్మాణ కార్మికులును గాలికి వదిలేసిందని, సంక్షేమ బోర్డు ద్వారా 22 లక్షల మంది నమోదు చేసుకుని ఉంటే ఇప్పటి వరకు 32,000 మందికి క్లైములు పెండింగ్‌లో ఉన్నాయని ఇందులోని సొమ్మును అంతా నవరత్నాలకు మళ్లించి భవనకార్మికులకు అన్యాయం చేశారని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తాడోపేడో తేల్చుకుంటామని, సంక్షేమ బోర్డు పునరుద్ధరించి క్లైములు ఇచ్చేంత వరకు అలిపెరగని పోరాటాలు సాగిస్తామని అందులో భాగంగా ఆగస్టు 9న క్విట్ ఇండియా డే సందర్భంగా క్విట్ జగన్ సేవ్ సంక్షేమ బోర్డు అని నినాదంతో ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా సాగిస్తామని ప్రకటించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ మహాసభలు డిసెంబర్ మొదటి వారంలో తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహిస్తామని తెలిపారు. గ్రూప్ సమావేశాలు గ్రూప్ మీటింగ్లు నిర్వహించి భవన నిర్మాణ కార్మికులు చైతన్యం చేసి, రాబోయే పోరాటాల సమావేశం చేస్తామని సమావేశంలో తీర్మానించారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కోట సత్తిబాబు, ఎన్ శ్రీరాములు, సోనారాజు, ఉమ్మర్వల్లి పి ఎస్ నారాయణ, భాను ప్రసాద్, దాసరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభల జయప్రదానికి

కార్మికులు కృషి చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ పిలుపు

మాట్లాడుతున్న రవీంద్రనాథ్. పక్కన దోనేపూడి శంకర్, వెంకట సుబ్బయ్య, రమణ తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలో అక్టోబర్ 14 నుంచి 18వ తేదీ వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి కార్మికుడు తనవంతు సహకారం అందించాలని ఏఐట యూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ విజయవాడ నగర జనరల్ బాడీ సమావేశం బుధవారం స్థానిక హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో మూలి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ సీపీఐ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శిగా నియమితులైన తాతయ్యను వివిధ కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మికులకు కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని, అటువంటి పార్టీకి కార్మికులు కూడా సంపూర్ణ సహకారం అందించాలని చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ నగరంలో ఏఐటీయూసీని బలోపేతం చేయడంలో మూలి సాంబశివరావు, తాతయ్య విశేష కృషి చేశారని అభినందించారు. కేంద్రంలోని మోదీ సర్కారు పెద్దఎత్తున కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తున్న తరుణంలో ఏఐటీయూసీ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఏఐటీయూసీ నేతృత్వంలో స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి అమలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకొస్తోం దన్నారు. ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే 138 ఏళ్ల కిందట చికాగో నగరంలో కార్మికుల త్యాగాల ఫలితంగా అమ ల్లోకి వచ్చిన ఎనిమిది గంటల పని విధానం రద్దవు తుందని, యజమాని దయపై కార్మికులు ఆధారపడి జీవించాల్సిన దుస్థితి వస్తుందన్నారు. కార్మికు లకు రక్షణగా ఉన్న చట్టాలు అన్నీ రద్దయిపోయాయని, కేవలం పోరాటాల ద్వారా మాత్రమే కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు విధానాలను అడ్డుకోగలమని చెప్పారు. ఇందుకోసం ఏఐటీయూసీని మరింత బలోపేతం చేయాలని కోరారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ మూలి సాంబశివరావు, తాతయ్య కృషితో నగరంలో ఏఐటీయూసీ పుంజు కుందని, కార్మికులపై ప్రభావాన్ని చూపగలిగిందని తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని అన్ని విభాగాల్లో ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు ఏర్పాటు చేశారని, స్తబ్దతగా ఉన్న సంఘాలను క్రియాశీలకంగా పని చేయడంలో విజయవంతమయ్యారని తెలిపారు. సార్వత్రిక సమ్మె, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమాలను విజయ వాడలో విజయవంతం చేయడం వెనుక ఏఐటీయూసీ కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తిని నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కమిటీ కొనసాగించి కార్మికులకు అండగా నిలవాలని కోరారు. తాతయ్య మాట్లాడుతూ అందరి సహకారం వల్లే విజయవాడ నగరంలో ఏఐటీయూసీని బలోపేతం చేయగలిగామని చెప్పారు. తాను పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే కృష్ణా జిల్లాకు వెళ్లాలని, ఇక్కడ కార్మికులకు, కమ్యూనిస్టు పార్టీకి నిరంతరం అందుబాటులోనే ఉంటానని తెలిపారు. ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆంజనేయులు, సాంబశివరావు

ఏఐటీయూసీ విజయవాడ నగర అధ్యక్షుడిగా కేఆర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా మూలి సాంబశివ రావును జనరల్ బాడీ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. వారికి కార్మిక నాయకులు అభినందనలు తెలిపారు.

తాతయ్యకు ఘన సన్మానం

ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవైన టి.తాతయ్యను రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య, పడాల రమణ, సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు నక్కా వీరభద్రరావు, ఏఐటీయూసీ నగర నాయ కులు ఘనంగా సన్మానించారు. వీరితోపాటు నగర నాయకులు, టాక్సీ వర్కర్స్, హెల్త్ వర్కర్స్, ముఠా కార్మికులు, ఆటో వర్కర్స్, ఆర్టీసీ పోర్టర్స్, ఆర్టీసీ స్వీపర్స్ యూనియన్, వీధి విక్రయదారులు, బుక్ బైండింగ్ వర్కర్స్ తదితర కార్మిక సంఘాల బాధ్యులు శాలువాలతో తాతయ్యను ఘనంగా సన్మానించారు.

ఏపీలోనే మరింత సంక్షోభం

దీనిపై కేంద్రం లోతుగా అధ్యయనం చేయాలి: పయ్యావుల కేశవ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: శ్రీలంక కంటే ఏపీ ఆర్థిక పరిస్థితి మరింత దారుణంగా ఉందని, దీనిపై కేంద్ర ప్రభుత్వం మరింత లోతుగా అధ్యయనం చేయాలని ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ పయ్యావుల కేశవ్ కోరారు. ఆయన బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతలు ఏం చెప్పారో కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం అదే చెప్పిందన్నారు. శ్రీలంక ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు అంచనా వేయడం కోసం కేంద్రం ఆర్థిక శాఖను, ఆర్బీఐని ఆదేశించిందన్నారు. దానిపై ఆర్బీఐ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర ఆర్థిక శాఖ మరొక నివేదికని తయారు చేసింది. ఆ నివేదికలో శ్రీలంక ఆర్థిక సంక్షోభం దిశగా వెళ్తున్న రాష్ట్రాలు గుర్తించింది. ఈ నివేదికని ప్రధానంగా ఇంటర్ నేషనల్ మానిటర్ ఫండ్ సూచనల మేరకు రిస్క్ ఎనాలసిస్ చేశారు. వాళ్లు ఇచ్చిన పది నివేదికలలో దాదాపు అన్నింటిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒకటి రెండు స్థానాలు మారుతూ మొదటి స్థానంలోనే ఉంది. మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత తీవ్ర స్థాయి సంక్షోభం దిశగా వెలుతుందనే దానికి ఉదాహరణ ఈ నివేదికేనన్నారు. రుణ పరిమితి దాటింది, ఇన్ ఫ్లేషన్ రేటు అధికంగా ఉంది, ఆదాయానికి అప్పులకి ఉన్న పరిమితికి ఎక్కడ సమతుల్యత లేదు. దాదాపు 50వేల కోట్ల రూపాయల అప్పులకు సంబంధించిన అకౌంటు వివరాలు పంపించలేదు. దాచిన లెక్కలని బయటకు తీయాల్సిన బాధ్యత సీఐజేలకు ఉంది. వాళ్ళు గత సంవత్సరం సంతకం పెట్టేటపుడు దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వనటువంటి క్వాలిఫైడ్ సర్టిఫికెట్‌ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చారు. శ్రీలంక అప్పులతో కుప్ప కూలిపోయిందంటే, ఆంధ్రప్రదేశ్ ఆ దేశం కంటే నాలుగు రెట్లు ఎక్కువ అప్పు చేసింది కనుక సంక్షోభం దిశగా వెళ్లమా ? అని ప్రశ్నించారు. శ్రీలంక సంక్షోభంలో ఉంటే ఇబ్బంది పడుతుంది రాజపక్స, గొటబాయ కుటుంబాలు, పాలకులు కాదని, అక్కడ ఉన్న సామాన్య ప్రజలే ఇబ్బంది పడతారన్నారు. పారిపోయిన విజయమాల్య, గొటబాయ కుటుంబంలాగా ఆర్థిక సంక్షోభం వస్తే ఈ పాలకులు ఏటో పారిపోతారు. పారిపోయిన వారికెవ్వరికి నష్టం జరగదు. రాష్ట్రంలో ఉన్న సామాన్యులు కష్టాలు అనుభవించే పరిస్థితి వస్తుందని కేశవ్ ఆందోళన వ్యక్తం చేశారు. అప్పు చేయడం తప్పు కాదు, అప్పుని సంక్రమంగా వినియోగించక పోవడం తప్పు. సంక్షేమం కోసమే అప్పు అని చెప్తున్న జగన్ మాటలు బూటకం. సంక్షేమం ముసుగులో వైసీపీ చేస్తున్న ఆర్థిక అరాచకం చాలా ఉందని ఆయన అన్నారు. కరోనా ఎమర్జెన్సీ కోసం నిధులు మంజూరు చేస్తే దాన్ని పీడీ ఖాతాలకు మళ్లించి ఇతర అవసరాలకు వాడుకున్నందుకు సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. రాష్ట్రంలో కొన్ని లక్షల పీడీ అకౌంటులు ఉంటే అందులో కొన్ని వేల అకౌంటులు యాక్టివ్‌గా ఉన్నాయి. కొన్ని వందల అకౌంటుల నుంచి ఇటువంటి డైవర్షన్ జరిగింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి సీఏజీ ఆడిట్‌కి సిద్ధంగా ఉంటారా? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డికి సంబంధించిన వ్యవస్థలు లాభాల దిశగా సాగుతున్నాయి, అప్పులు చేస్తే తీర్చేయగలుగుతున్నారు, ఆదాయాన్ని 10రెట్లు పెంచుకోగలుగుతున్నారు. రాష్ట్రానికి మాత్రం ఆదాయం పడిపోతుంది, అప్పులలో కూరుకుపోతుంది. అందుకే కేంద్రం ఏపీ ఆర్థిక పరిస్థితిని సీరియస్‌గా పరిగణించి లోతుగా పరిశీలన చేయాలని పయ్యావుల కోరారు.

గీతం దంత వైద్య కళాశాలకు 33వ ర్యాంకు

విశాలాంధ్ర - మధురవాడ: జాతీయ స్థాయిలో కేంద్ర విద్యాశాఖ ఇటీవల ప్రకటించిన ఎన్.ఐ.ఆర్.ఎఫ్. (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) 2022లో గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రికి 33వ ర్యాంకు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ సీతారామరాజు తెలిపారు. దేశంలోని 300కు పైగా ప్రభుత్వ, ప్రైవేటు దంత కళాశాలల పనితీరును పరిశీలించి ఈ ర్యాంకులను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 20 సంవత్సరాల కిందట ఏర్పాటైన గీతం దంత వైద్య కళాశాల ఆసుపత్రి అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో బీడీఎస్ కోర్సుతో పాటు పీజీ కోర్సులను ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తోందన్నారు. నోటి ఆరోగ్యంపై ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలతో పాటు ఏటా దాదాపు లక్ష మందికి వైద్య సేవలు అందిస్తోందని తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది సమష్టి కృషితో భవిష్యత్తులో మెరుగైన ర్యాంకు సాధిస్తామన్నారు.

సంపాదకీయం

పార్లమెంటు అర్థరాత్రి సమావేశం కావడం మన పార్ల మెంటు చరిత్రలో రెండే రెండుసార్లు జరిగింది. మొదటిసారి దేశం స్వతంత్రమైనప్పుడు జరిగింది. మళ్లీ 2017 జులై ఒకటవ తేదీన నరేంద్ర మోదీ హయాంలో పార్లమెంటు అర్థరాత్రి సమా వేశం అయింది. అప్పుడే వివాదాస్పదమైన, సంక్లిష్టమైన వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) విధించారు. ఒకే దేశం, ఒకే పన్ను అన్న అందమైన నినాదం వినిపించారు. గోధుమలు, పాలు, పాలతో తయారు చేసే పదార్థాలు మొదలైన వాటి మీద పన్ను విధిం చడం ఎంత ఘోరమో చూడండి అని మోదీ అంతకు మునుపటి ప్రభుత్వాన్ని ఎగతాళి చేశారు. ఇప్పుడు సరిగ్గా అలాంటివే అనేక వస్తు వుల మీద జి.ఎస్.టి. విధించారు. కేంద్రంలో అధికారంలోకి రాక ముందు ఫలానా, ఫలాన వస్తువులపై పన్ను విధించడం ఎంత ఘోరం అని ఉద్వేగభరితంగా చెప్పారో వాటన్నింటిపైన ఇప్పుడు ఆ పన్ను విధిం చారు. ప్రతి అంశాన్ని మసి పూసి మారేడు కాయ చేయడంలో మోదీ సర్కారుది అందె వేసిన చేయి. నిత్యావసర సరుకులపై 5 నుంచి 12 శాతం జి.ఎస్.టి. విధించారు. మరికొన్నింటిపైనైతే 18 శాతం జి.ఎస్.టి. విధించారు. ఆసుపత్రి పడకలకు అంతకు ముందు జి.ఎస్.టి. ఉండేది కాదు. ఇప్పుడు రోజుకు రూ. 5000 వసూలు చేసే ఆసుపత్రి పడకలపై 5 శాతం జి.ఎస్.టి. విధించారు. వెయ్యి రూపాయలకన్నా తక్కువ అద్దె ఉండే హోటల్ గదుల్లో ఉండేవారు ఇంతకు ముందు ఈ పన్ను చెల్లించ వలసిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు 12 శాతం పన్ను వడ్డించారు. రోజుకు రూ. వెయ్యి తక్కువ అద్దె వసూలు చేసే హోటల్ గదుల్లో ఉండే వారు సాదాసీదా మామూలు మనుషులేగా! మోదీ సర్కారు ప్రత్యమ్నాయ ఇంధన వనరుల అవసరం గురించి అనునిత్యం ఊదర గొడ్తుంది. కానీ సౌర హీటర్ల మీద ఇంతవరకు 5 శాతం ఉన్న జి.ఎస్.టి.ని అమాంతం 12 శాతానికి పెంచేశారు. విద్యుత్తు తక్కువ ఖర్చై ఎక్కువ వెలుతురు ఇచ్చే ఎల్.ఇ.డి. బల్బులు తాము జనానికి తక్కువ ధరకు అందుబాటులోకి తెచ్చాం అని సొంత డబ్బా వాయించుకున్న మోదీ ఇప్పుడు వాటి మీద జి.ఎస్.టి. 12 శాతం నుంచి ఏకంగా 18 శాతానికి పెంచింది. సామా న్యుడి వాహనమైన సైకిళ్ల మీద 12 శాతం పన్ను విధించిన సర్కారు కాస్త కలిగినవారు వినియోగించే ఎలక్ట్రిక్ సైకిళ్ల మీద 5 శాతం మాత్రమే పన్ను విధించింది. పెట్రోల్ ధరలు మండిపోతున్న స్థితిలో సైకిళ్లు వాడదాం అనుకున్న వారి మీద అధిక జి.ఎస్.టి. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టే. ఇంకా విచిత్రం ఏమిటే వజ్రాలు పొదిగిన నగల మీద 0.25 శాతం పన్నే విధించారు. సకల వస్తువుల ధరలు పెరుగుతూ, ఆర్థిక వ్యవస్థ కుదేలవుతూ, నిరుద్యోగం పెరుగుతున్న విపత్కర పరిస్థితిలో మోదీ సర్కారు పనిగట్టుకుని సామాన్యుడి నడ్డి విరిచే రీతిలో ప్రవర్తిస్తోంది. అందరి తోడ్పాటు, అందరి అభివృద్ధి అన్న మోదీ నినాదంలోని డొల్ల తనాన్ని వివరించడానికి ఇంతకు మించిన ఉదాహరణలు ఉండవు.

చేసిన నష్టాన్ని గురించి చెప్పుకోవడంకన్నా చేయకుండా మిగిల్చిన నష్టం తమ ఘనతేనని వాదించడంలో మోదీ సర్కారును మించింది

గబ్బర్ సింగ్ దెబ్బ

లేదు. ఒక వేపు పప్పులు, తృణధాన్యాలు, గోధుమలు, ఆవాలు, ఓట్స్, మొక్క జొన్నలు, బియ్యం, గోధుమ పిండి, బొంబాయి రవ్వ, శెనగ పిండి, మొర్మొరాలు, పెరుగు మొదలైన వాటి మీద వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) వేయలేదు చూడండి అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్ సమర్థించుకోవడం విచిత్రంగా ఉంది. అయితే వీటన్నింటినీ ప్యాక్ చేసి అమ్మితే జి.ఎస్.టి. వర్తిస్తుంది. విడిగా కొంటేనే జి.ఎస్.టి. ఉండదు. జి.ఎస్.టి.లాంటివి పరోక్ష పన్నులు. ఆదాయపు పన్ను చెల్లించే వారు మన దేశంలో కోటిన్నర మందే ఉన్నారని మోదీ బాధ. ఆదాయపు పన్ను చెల్లించే వారు కాస్త స్థితిమంతులు అనుకుందాం. కానీ తాజాగా విధించిన జి.ఎస్.టి. ప్రతి పౌరుడికీ వర్తిస్తుంది. పరోక్ష పన్నులు పెంచడంలో ఉన్న కిటుకు ఇదే. విలాసవంతమైన వస్తువుల మీద పన్ను పెంచకుండా సగటు జీవి కొనే వస్తువుల ధరలు పెంచే రీతిలో పన్ను విధించడం చూస్తే మోదీ కోరేది అందరి సంక్షేమం కాదు తన భజన పరులైన గుప్పెడు మంది ప్రయోజనాన్నే అని ఎవరికైనా అర్థం అవు తుంది. కానీ ఈ కష్టాలు గుర్తుకు రాకుండా మోదీ సర్కారు సామాన్యుడికి చిన్న చిన్న తాయిలాలు పెట్టడంతో పాటు హిందుత్వ మైకం కమ్మేట్టు చేసి సామాన్యుడు అసలు విషయం ఆలోచించకుండా చేస్తున్నది. జి.ఎస్.టి. వసూళ్లు 56 శాతం పెరిగినా ఇంకా వడ్డింపుల్లోని ఆంతర్యం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 2019లో కార్పొరేట్ పన్ను తగ్గించారు. తాజా వడ్డింపులపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే జి.ఎస్.టి. మండలిలో ఉండేది రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు 33 శాతం ఉంటారు. అనేక రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయికనక ఆ మంత్రులు ఎటూ నోరు మెదపలేరు. ప్రతిపక్షాల గొంతు అన్ని విషయాల్లోనూ చాలా పీలగానే ఉంది. అందుకని అధి కారంలో లేని ప్రతిపక్షాల వాణి జి.ఎస్.టి. లాంటి అంశాలలో వీధుల్లో వినిపించాల్సిందే తప్ప విధాన నిర్ణయాలు తీసుకునే చోట కాదు. ప్రభుత్వానికి ఆర్థిక వనరులే అవసరమైతే సంపన్నుల మీద పన్ను విధించాల్సింది. దానికి విరుద్ధంగా బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత సంపద పన్ను రద్దు చేశారు. సామాన్యుడి మీద కనికరమే ఉంటే సంపన్నులకు ఇచ్చిన రాయితీలు ఉపసంహరించవచ్చు. సంపద పన్ను విధించవచ్చు. కానీ మోదీకి అండగా ఉండేది, ఎన్నికల నిధులు సమ కూర్చేది వ్యాపార వర్గాలు, సంపన్నులే కనక వారి జోలికెళ్లరు. విలాస వస్తువులపై అధిక పన్ను, నిత్యావసర సరుకులపై తక్కువ జి.ఎస్.టి. విధిస్తామని చెప్పిన మాటను మోదీ సర్కారు విస్మరించడం ప్రయత్న పూర్వకమైందే.

జి.ఎస్.టి. వల్ల ద్రవ్యోల్బణం తగ్గుతుందని, స్థూల జాతీ యోత్పత్తి పెరుగుతుందని, నల్ల ధనం తగ్గుతుందని చేసిన వాగ్దానాలన్నీ గాలికి కొట్టుకు పోయాయి. తాజా వడ్డింపుల వల్ల ఎక్కువ నష్టపోయేది అసంఘటిత రంగం, సామాన్యులే. అసలు జి.ఎస్.టి. వ్యవహారమంతా గందరగోళమే. ఇప్పటికి 47 సార్లు జి.ఎస్.టి. మండలి సమావేశాలు జరిగాయి. వందలు వేల సంఖ్యలో ఉత్తర్వులు వెలువడ్డాయి. వాటన్నిం టినీ అర్థం చేసుకోవడమే పెద్ద పని. ఈ పన్ను వల్ల చిన్న వ్యాపారులు ఎప్పుడో దెబ్బ తిన్నారు. పరోక్ష పన్ను విధించేది ఒక వస్తువుపై అయితే దాని ప్రభావం మరెక్కడో కనిపిస్తుంది.

కొండలను నుగ్గు చేసిన న్యాయవాది

కథ పాతదే. కానీ కథానాయకుడు పూనం చంద్ సోలంకి పేరు చాలా మందికి పరిచయం లేకపోవచ్చు. సరిగ్గా నాలుగేళ్ల కింద అంటే 2019 మే ఆరో తేదీన పూనం చంద్ సోలంకి జీవితంలో మరపురాని రోజు. ఆయన ఒక సాదా సీదా న్యాయవాదే అనడంకన్నా అనామక న్యాయవాది అనడమే మెరుగు. ఆ కథ ఇప్పుడు ఎందుకు చెప్పుకోవాలి అని అడిగేవారు ఉండొచ్చు. కానీ సాక్షాత్తు ప్రధానమంత్రి మోదీకి గురువైన అసుమల్ సిరుమలానీ జర్పలానీకి యావజ్జీవ కారాగార శిక్ష పడడానికి ప్రధాన కారకుడు ఈ పూనం చంద్. ఇంతకూ అసుమల్ సిరుమలానీ హర్పలానీ అన్న సుదీర్ఘమైన పేరున్న ఆ మహానుభావుడిని గుర్తు పట్టడం కష్టమే. అసారాం బాపూ అంటే లక్షలు కోట్ల మంది గుర్తుపడ్తారు. 1941లో పుట్టిన ఈ "మహనీయుడు" నిజంగా అసామాన్యుడే. లేకపోతే ఈడైనా రాని అమ్మాయి మీద అత్యాచారం, హత్య, నేరపూరిత వేధింపు లాంటి "ఘన"కార్యాలకు సాహసించే అవకాశం ఎక్కడుంటుంది.

మూడేళ్ల కిందట అసారాం బాపు కేసు విచారణకు వచ్చినప్పుడు ఆయన తరపున వాదించడానికి 14 మంది ప్రసిద్ధ న్యాయవాదులు హాజరయ్యారు. మరి అసారాం బాపు మోదీకి గురువు కదా! అంతకు ముందు కీ.శే. రాం జేత్మలాని, సల్మాన్ ఖుర్షీద్, సుబ్రహ్మణ్యం స్వామి, ఉదయ్ లలిత్ లాంటి వారు అసారాం బాపు తరపున వాదించినవారే. ఉదయ్ లలిత్ తరవాత సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థాయికి ఎదిగారు.

ఇంతకీ కేసు ఏమిటంటే అసారాం బాపు ఒక మైనర్ బాలికపై అత్యా చారం చేశాడని. ఆ బాలిక తరపున హేమాహేమీలైన లాయర్లను న్యాయ స్థానంలో ఒంటరిగా ఎదుర్కున్నది పూనం చంద్ సోలంకి అనే సాదా సీదా న్యాయవాది. ఆయనే ఆ బాలిక తరపున చివరిదాకా వాదించి అసారాంనకు శిక్ష పడేట్టు చేయగలిగారు. అసారం తరపున వాదించిన న్యాయవాదులు ఒక్కసారి విచారణకు హాజరైతే రూ. 20 లక్షలు ఫీజు వసూలు చేసేటంతటి పెద్దవారు. వారు కోర్టుకు రావడానికి ఖరీదైన ఆడి కార్లు ఏర్పాటు చేస్తారు.

అసారాం బాపు | పూనం చంద్

పూనం చంద్ మాత్రం తన స్కూటర్ మీద మాత్రమే తిరుగుతారు.

పూనం చంద్ సోలంకీ లాంటి "అనామక", "లబ్ధ ప్రతిష్ఠులు" కాని న్యాయవాదుల కారణంగానే సామాన్య జనానికి కోర్టుల్లో న్యాయం జరుగు తుందన్న ఆశ మిణుకుమిణుకుమంటోంది కాబోలు. ప్రాణాలకు తెగించి పూనం చంద్ ఈ కేసు వాదించాడు. ఆయనకు కోట్లాది రూపాయలు ఇవ్వజూపారు. దానికీ లొంగకపోతే చంపేస్తామని బెదిరించారు.

ఈ కేసులో విచారణ సవ్యంగా జరగడం లేదని గ్రహించిన 16 ఏళ్ల నిర్భాగ్యురాలి తల్లిదండ్రులు 2014లో పూనం చంద్‌ను సంప్రదించారు. అయితే తాము డబ్బులిచ్చుకోలేమన్నారు. పూనం డబ్బు మనిషి కానందువల్ల ఎలాగైనా ఆ అమ్మాయికి న్యాయం జరిగేట్టు చూడాలనుకున్నాడు. పొట్టపోసు కోక తప్పని ఆ న్యాయవాది ఉచితంగా న్యాయం కోసం, సత్యం కోసం పోరాడడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది.

పూనం చంద్ రైల్వేలో పని చేసే ఓ మెకానిక్ కొడుకు. వారిది దర్జీ కుటుంబం. అసారం బాపులాంటి పలుకుబడి, సంపత్తి, అండదండలు కలిగిన వారిని దోషులుగా నిలబెట్టాలని అనుకోవడం సాహసమే. పూనం చంద్‌కు చంపేస్తామన్న బెదిరింపులు అలా ఉంచితే అసారాం బాపునకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడానికి సిద్ధమైన తొమ్మిదిమందిపై దాడి చేశారు. ముగ్గురిని కాల్చి చంపారు. ఒకరి ఆచూకీ ఇప్పటికీ తెలియదు. అతడిని కోర్టు బయటే పొడిచారు కూడా. దర్యాప్తు చేసిన అధికారులను, ఆయనకు వ్యతిరేకంగా వాదించే న్యాయవాదులను, జడ్జీలను కూడా అసారాం బాపు మద్దతుదార్లు బెదరగొట్టారు. అంతు చూస్తామన్నారు. ఈ కేసులో పూనం చంద్ ఎక్కువగా కింది కోర్టులోనే వాదించినా కొన్నిసార్లు హైకోర్టు, సుప్రీంకోర్టులోనూ వాదించవలసి వచ్చింది.

పూనం చంద్ రచయిత కూడా. కోర్టు పనిలో తీరిక దొరికితే రచన మీద దృష్టి పెడతారు. ఆయన అనేక న్యాయగ్రంథాలు రాశారు. పాఠాలు చెప్పడం అన్నా ఆయనకు ఇష్టమే.

– అనన్య వర్మ

నోట్ : అనివార్య కారణాల వల్ల ఈ ఏడాది జనవరిలో ఆగిపోయిన ఒకే ఒక్కడు శీర్షిక మళ్లీ ప్రారంభం అవుతోంది – సం.

క్రిమినల్ కేసుగా బాబ్రి కూల్చివేత

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

బాబ్రి మసీదు కూల్చివేతలో నిందితుల జోక్యా నికి తగిన ఆధారాలు లేవని 32 మంది బీజేపీ ప్రము ఖులు అద్వానీ, మురళి మనోహర్ జోషి, ఉమా భారతి, వినయ్ కతియార్, రితంబర వగైరాలు నిర్దో షులని 30.09.2020న సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పి చ్చింది. కేసులో సాక్షులైన మహబూబ్, సయ్యద్ అఖ్లాఖ్‌లు 8.1.2021న ఈ తీర్పుపై పునర్విచార ణకు అభ్యర్థన చేశారు. మసీదును కూల్చిన తర్వాత పక్కనే ఉన్న వీరి ఇళ్లను సంఘీయులు కాల్చారు. ఈ కేసు పునర్విచారణ కుదరదని, క్రిమినల్ అప్పీల్‌గా మార్చాలని జస్టిస్ దినేష్ కుమార్ సింగ్ తన కార్యాలయాన్ని ఇటీవల ఆదేశించారు.

6.12.1992న బాబ్రి మసీదును కావాలని కూల్చివేశారు. కూల్చివేతకు పథకం లేదు. ఇది సంఘ వ్యతిరేకశక్తుల ఆకస్మిక చర్య. ఇదీ లక్నో సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు. ఆకస్మికత న్యాయసమ్మతమా? "అశోక్ సింఘాల్ కూల్చే వారిని ఆపడానికి ప్రయత్నించారు. సీబీఐ ఆధారాలు చూపడంలో విఫలమైంది. (చెప్పినట్లు నటించింది)" ఇది న్యాయమూర్తి సురేంద్రకుమార్ యాదవ్ వివరణ. కరసేవను ప్రారంభించిన సింఘాల్‌కు మసీదు కూలుతుందని బాధలేదు. మసీదులోని బాలరాముని బొమ్మ పగులుతుందని భయం. 850 సాక్షాలు, 7వేల పత్రాల్లో కోర్టుకు ఆధారాలే దొరకలేదు. మసీదును కూల్చిన 1.5 లక్షల మంది కరసేవకులనూ నిర్దోషులుగా వదిలారు. మసీదు కూల్చివేతకు రెచ్చగొట్టే ఉప న్యాసాలు, హిందు, ముస్లింల మధ్య శతృత్వంపెంపు, అల్లర్ల ప్రేరేపణ ఇవి నింది తులపై అభియోగాలు. ఇవి వాస్తవం. కరసేవకుల కవ్వింపునకు, ప్రణాళిక లేని మసీదు కూల్చివేతకు కరసేవ నిర్వాహకులదే తప్పు. సీబీఐ కాంగ్రెస్ గూటి చిలు కని సుప్రీంకోర్టే వ్యాఖ్యానించింది. బీజేపీ బందీనని తానే రుజువు చేసుకుంది.

అయోధ్యలో బాబ్రి మసీదు స్థలాన్ని రామ జన్మభూమిగా సంఘ్ ప్రకటిం చింది. మసీదున్న చోటే మందిర్ కట్టాలని తీర్మానించింది. మసీదును కూల్చేసి మందిర్ కట్టాలి. మందిర్ నిర్మాతలే మసీదు కూల్చివేత కుట్రదారులు. నేల చదును చేయమని కరసేవకులకు వాజ్‌పేయి సూచించారు. పికాసి, గునపాలతో ఊగుతున్న కార్యకర్తలకు ఈ మాట మసీదును కూల్చాలన్న సంకేతాన్నిచ్చింది. నాటి ఉత్తరప్రదేశ్ బీజేపీ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ మసీదును కాపాడతానని సుప్రీంకోర్టుకు మాటిచ్చి, కూల్చివేతకు ఏర్పాట్లు చేశారు. పోలీసులను కట్టడి చేసి కూల్చివేతకు సాయపడ్డారు. కాంగ్రెస్ ముసుగు సంఘ్ ప్రధాని నరసింహారావు మౌనంతో తోడ్పడ్డారు. తర్వాత, తప్పుచేశానని శిక్ష అనుభవించడానికి సిద్ధమని సింగ్ అన్నారు. ఉమాభారతి మేము మసీదును కూల్చామని గర్వంగా చెప్పారు. కూల్చివేతకు శివసేన బాధ్యత వహించింది. ఇవన్నీ కూల్చివేత కుట్రకు సాక్ష్యాలే.

బాబ్రి కూల్చివేత మత అల్లర్లకు దారితీసి 3 వేల ప్రాణాలు తీసింది. గోధ్రా ఘటనకు, నేటి ఘోరాలకు మూలం ఇదే. నాటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి రాజ నాథ్‌సింగ్ 8-10-1993న కూల్చివేత కేసును రాయిబరేలి కోర్టు నుండి లక్నో కోర్టుకు మార్పించారు. ఈ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. హైకోర్టు

ఆమోదం తప్పనిసరి. ఈ లోపాన్ని సరిచేసుకోమని 12-2-2001న యుపి హైకోర్టు రాజనాథ్‌ను ఆదేశించింది. ఆయన కోర్టు ఆదేశాన్ని పాటించలేదు. ఫలి తంగా అద్వానీ, ఉమాభారతితో పాటు 12 మంది ప్రత్యేక కోర్టు విచారణ తప్పిం చుకున్నారు. 1998 వరకు, 2004-2014 మధ్య కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సీబీఐ విచారణ చేపట్టలేదు. మెజారిటీ మత ఓట్ల విషచక్రం వారిని కూల్చివేత కుట్ర అన్వేషణ నుండి దూరం చేసింది. 18 ఏళ్ల తర్వాత మొదలైన విచారణ నత్తలా నడిచింది. ప్రజాప్రతినిధుల నేరాలు తొందరగా విచా రించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. బాబ్రి కూల్చివేత కేసులో జాప్యానికి 6.3.2020న ఆందోళన వెలిబుచ్చింది. లక్నో, రాయిబరేలీ కేసులను కలిపి విచారించమంది.

2019 నవంబరులో మసీదు స్థల వివాదంలో సుప్రీంకోర్టు భక్తివిశ్వాసాల తీర్పిచ్చింది. మసీదులో రామ బొమ్మ పెట్టటం అపవిత్ర చర్య. మసీదు కూల్చివేత ఘోర చట్ట ఉల్లంఘన అంటూనే మొత్తం 2.77 ఎకరాలూ రామునికే ఇచ్చింది. మసీదును రక్షిస్తామని తనకిచ్చిన హామీని తుంగలో తొక్కి రాజ్యాంగ విరుద్ధంగా మసీదు కూల్చిన వారికే మసీదు-స్థలం కట్టబెట్టింది. చట్టవ్యతిరేక చర్యలనే గౌరవించటం, బాధితులకు కాక నేరస్తులకే లబ్ధి చేకూర్చటం తీర్పు వైరుధ్యం. తాము కోరిన తీర్పులనే కోర్టులిచ్చాయని బీజేపీ నాయకులన్నారు. 2010లో సుప్రీం జడ్జీలు పిసి ఘోష్, ఆర్.ఎఫ్. నారిమన్‌లు మసీదు కూల్చివేత భారత లౌకిక బంధాన్ని తెంచిందన్నారు. న్యాయమూర్తి మన్మోహన్‌సింగ్ లిబర్హాన్ వాజ్ పేయి, అద్వానీ, జోషిలకు పరివార్ కూల్చివేత పథకం తెలియదనడానికి వీల్లేదని తన సుదీర్ఘ నివేదికలో వివరించారు. కరసేవకుల సమీకరణ ఆకస్మికం, ఐచ్ఛికం కాదు. పథకం ప్రకారం చేసిన ఏర్పాటన్నారు. "కరసేవకులైన" విశ్వ హిందు పరిషత్ కార్యకర్తల అభ్యాసాల ఫోటోలు, వీడియోలను మసీదు కూల్చివేత తర్వాత మీడియా చూపింది. చాలా ప్రదేశాల్లో జరిగిన సమావేశాల్లో నిందితులు సంతోషంగా పాల్గొన్నారు. ఈ పని దేశభక్తి గేయాలతో కాక పార, పికాసి, సమ్మెట, తాళ్ళు, ఇటుకలతో జరగాలని అద్వానీ నొక్కిచెప్పారు. "సేవకులు" ఈ పనిముట్లతోనే వెళ్లారు. "ఇంకొక వేటు వెయ్యి. మసీదు కూల్చివెయ్యి" వంటి నినాదాలు మిన్నంటాయి. ఈ ఫోటోలు, వీడియోలు ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పని చేస్తున్న ప్రవీణ్ జైన్ దగ్గర ఉన్నాయి. అప్పుడు పయోనీర్‌లో పనిచేసిన ఆయన విహెచ్‌పి సభ్యునిగా సాధనా స్థలాలకు వెళ్లారు. రామకథ కుంజ్‌పై నుంచొని అద్వానీ, జోషి, విజయరాజే సింధియా, రితంబర నినాదాలతో ప్రేరేపిస్తూ, మసీదు కూల్చివేతను చూస్తున్న ఫోటో వాటిలో ఉంది. రెచ్చగొట్టడం ప్రమాద కరం. ఈ సాక్ష్యాలను సీబీఐ ఇవ్వలేదా? నేటి భారత ప్రభుత్వ హిందు ఆధి పత్యాన్ని దృష్టిలో పెట్టుకొని కోర్టులు తీర్పులిస్తున్నాయి.

గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు ఇచ్చిన వాస్తవపత్రంలో మసీదు కూల్చివేత జాతీయ అవమానమంది. నేటి సంఘ్ ప్రభుత్వం జాతీయ సిగ్గును భారతీయ సాంస్కృతిక గౌరవంగా మార్చింది. మసీదును ఎవరూ కూల్చలేదు, దానంతటదే పడిందన్న వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపించాయి. ఈ తీర్పు న్యాయ మైందా అన్నది చరిత్ర చెపుతుందని సీనియర్ అడ్వొకేట్లు ప్రశాంత్ భూషణ్, సంజయ్ హెగ్డే బాధపడ్డారు. "టాగూర్ అన్నట్లు నేడు న్యాయం మౌనం వహించింది. ఏడుపే దాని గత్యంతరం." అని సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి అశోక్ కుమార్ గంగూలీ వాపోయారు. ఈ తీర్పుతో సమాజ, మత విభజన, ముస్లింల భయాందోళనలు పెరిగాయి. ఓట్ల కోసం ముస్లింలను దువ్విందన్న నింద మోసిన కాంగ్రెస్ బలహీనపడింది. ముస్లింలకు కొంత అండగా ఉన్న ప్రాంతీయ పార్టీలు ఆత్మరక్షణలో పడ్డాయి. బీజేపీ మతాధార ఎన్నికలు, హిందు సమీకరణ ముస్లింలను ఇతరులను చేశాయి. వారు ఏకాకులయ్యారు. ప్రజా స్వామ్యం, రాజ్యాంగాల మీద నమ్మకం కోల్పోతున్నారు. వారిలో అన్యాయాల, అక్రమాల ఆందోళనలు, అభద్రతాభావం ఎక్కువయ్యాయి.

6.12.1992న రామ జన్మభూమిలో ఏమైందో, ఎందుకయిందో, ఎవరు చేశారో, ఎన్ని ప్రాణాలు పోయాయో, ఎంత ప్రజా సంపద నష్టమైందో, ఎవరికి రాజకీయ లబ్ధి కలిగిందో, లౌకికత్వ, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు ఎంత దిగజారాయో మనకు తెలుసు. వాటిని చట్టసమ్మతం చేశాం. మోసగాళ్లను మన్నించటం, మోసాలను మరవటం మన సుగుణం. ఉత్తరప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల, కేంద్ర ఎన్నికల్లో వారినే గెలిపించాం. ఇప్పుడు వల్లకాటిలో కేకలు పెడుతున్నాం.

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, 9490204545

సామాజిక న్యాయం సంకేతప్రాయం కారాదు

ఈ-మెయిల్

భారతదేశపు 15వ రాష్ట్రపతిగా ద్రౌపదీ ముర్ము ఎన్నిక ఇక లాంఛనప్రాయమే. స్వాతంత్ర్య అమృతోత్స వాల్ని జరుపుకుంటున్న వేళ ఆదివాసీ మహిళ ప్రథమ పౌరురాలు కానుండడం సంతోషదాయకం. ఆమె పేద రికం, వెనుకబాటుతనం నేపథ్యంగా ఉన్న సాధారణ కుటుంబం నుండి రాజకీయ ఉన్నత శిఖరాలకు చేరడం ఖచ్చితంగా ఒక బలమైన సామాజిక సందేశం. అయితే ఇప్పటికీ సామాజిక న్యాయం సాధన దిశగా దేశం వెళ్లా ల్సిన దూరం చాలా ఉంది. ఉన్నత పదవుల్లో అణగారిన వర్గాలు కనిపించడం సామాజిక న్యాయం సాధ్యమేనన్న భరోసా మాత్రమే కలిగించగలవు. అయితే కార్య క్షేత్రంలో జరగాల్సిన కార్య క్రమాలు, వ్యవస్థలో చెయ్యగలిగిన మార్పులు చెయ్యకపోతే పెద్దగా ఫలితం ఉండదు. ఉదాహరణకి ఛత్తీస్‌ఘడ్‌లో ఉపా చట్టం క్రింద ఐదేళ్లుగా జైళ్లలో మగ్గుతున్న 121 మంది గిరిజనుల్ని కోర్టు నిర్దోషు లుగా గుర్తించి విడుదల చేసింది.. వారు నేరం చేసినట్టు ఏ విధ మైన ఆధారాలు లేవంటూ. అంటే లోపభూయిష్టమైన దర్యాప్తు వల్ల, విచారణా ప్రక్రియల్లో లొసుగుల వల్ల వారికి ఐదేళ్లుగా బెయిల్ కూడా దొరకని జైలు జీవితం ప్రాప్తమైంది. సుప్రీంకోర్టు కూడా అనేక దఫాలుగా చేయని నేరానికి జైళ్లలో మగ్గుతున్న విచారణా ఖైదీల గురించి బాధపడింది. అందులో అత్యధికులు అణగారిన పేద వర్గాలవారే. ఈ లోకసభ సమావేశాల్లో కేంద్రం అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు ప్రతిపాదించే బిల్లుని ప్రవేశ పెట్ట నుంది. అందులో ముఖ్యమైన అంశం అటవీ భూమి వేరే అవసరా లకు ఏదైనా కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టాలంటే ఇంతవరకూ తప్పని సరిగా ఉన్న గ్రామసభ తీర్మానం పొందడం అన్నది ఇకపై అక్కర లేదంట. ఇది అటవీ హక్కు లకు వ్యతిరేక ప్రతిపాదన. ఇప్పటికీ నిర్వాసితులకు సరైన న్యాయం చెయ్యకుండానే పలు ప్రాజెక్టులు పట్టాలకెక్కుతున్నాయి. ఇలాంటి సవరణలు వస్తే నిర్వాసితుల సమస్యలు మరింతగా పెరుగుతాయి. నిర్వాసితులంటే అత్యధిక భాగం ఆదివాసీలు, నిరుపేదలే. విద్యలో, ఉపాధిలో, ఆరోగ్యసేవలు పొందడంలో ఎంతో వెనకబాటు అనుభ విస్తున్న ఆదివాసీలకు ప్రభుత్వం చేయూతనివ్వడం, హక్కుల్ని పరిరక్షిం చడం, అవకాశాలు కల్పిం చడం ఎంతో అవసరం. ఆ దిశగా సమగ్ర మైన కృషి జరిపినప్పుడే సామాజిక న్యాయం చేతికి అందుతుంది.

డా. డి.వి.జి.శంకర రావు, 94408 36931.

బైజూస్ 'పాఠాలు'... ప్రచార పటాటోపాలు!

హరి వెంకట రమణ

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్య కొండ నాలుకకు మందు వేస్తే వున్న నాలుక ఊడిందనే చందంగా ఉంది. అత్యంత వేగవంతమైన సంస్కరణల్లో భాగంగా డిజిటలీ కరణనూ తీసుకొస్తోంది. జాతీయ విద్యా విధానం-2020 చెబుతున్నదీ ఇదేగా. ఆ దిశగా అడుగులేస్తున్న మన రాష్ట్ర ప్రభుత్వం రూ. 500 కోట్లతో టాబ్‌లను కొను గోలు చేసేందుకు బైజూస్ మల్టీ నేషనల్ కంపెనీతో ఒప్పందంపై సంతకాలు చేసింది. ఇందుకోసం బైజూస్‌నే ఎందుకు ఎంచుకుంది? ఎన్‌సిఈఆర్‌టితో ఈ పని చేయలేమా? వీటి ద్వారా లబ్ధి పొందే అవకాశాలెంత? ఓ పరిశీలన చేద్దాం.

పిల్లలకు డిజిటల్ విద్యను అందించడం ద్వారా అనుభవాత్మక విద్యనందించ వచ్చునని మన రాష్ట్రప్రభుత్వం చెబుతోంది. సుమారు 4.5 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని, డిజిటల్ పద్ధతి ద్వారా విద్యా సామర్థ్యాలు మెరుగయ్యే అవకాశాలు అధికమని అంచనా. ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ 2025లో పదవ తరగతి సి.బి.ఎస్.సి.లో రాసే విద్యార్థులు దీని పరిధిలోకి వస్తారు. దీని ద్వారా నాలగవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే పిల్లలు సబ్జెక్టు పరమైన పరిణితిని పొందుతారంటోంది ప్రభుత్వం. సాంప్రదాయ బోధనా విధానాన్ని అధిగ మించడానికి, స్వీయ అభ్యసన ప్రాతిపదికలో డిజిటల్ విద్య ప్రధాన పాత్ర పోషి స్తోంది. కొత్త విషయాలు నేర్చుకోవడంలో పాఠ్య పుస్తకాలకన్నా అదనంగా విజ్ఞానాన్ని తెలుసుకోవడానికి ఆన్‌లైన్, డిజిటల్ విద్య ఈ పోటీ ప్రపంచంలో ప్రధానమైనది. నూతన విద్యా విధానం 2020 ప్రకారం ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుండి ఆధునిక విద్యా బోధన అందుకోవడానికి పాఠశాల విద్య కొత్త పుంతలు తొక్కుతూ డిజిటల్ వేదికలు వచ్చాయి. ఇదంతా బానే ఉంది కానీ జనాభాలో అధిక శాతమైన బహుజనులకు, పేద పిల్లలకు, గిరిజనులకు ఇవి ఎంతమేరకు అందుతాయన్నదే ఇక్కడ అసలు ప్రశ్న?

కోవిడ్ ఆన్‌లైన్ విద్యను ముందుకు తెచ్చింది. ఈ అనుభవాలు భౌతిక తరగతుల ఆవశ్యకతను తెలిపాయి. ఆన్‌లైన్ విధానం ద్వారా విద్య అందించడానికి ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు కృషి చేసినప్పటికీ ఎక్కువశాతం మందికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు ఆన్‌లైన్ విద్య అందని ఫలంలా ఉండిపోవడం, అందరికీ డిజిటల్ పరికరాలు లేకపోవడం, కంప్యూటర్ సౌకర్యం లేకపోవడం, ఆండ్రాయిడ్ ఫోను ఉన్నప్పటికీ ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో ఉండకపోవడం, గిరిజన ప్రాంతాల్లో, పట్టణ పేద కుటుంబాలలో ఎటువంటి వసతి లేకపోవడం లాంటి ఇలా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి, 3-17 వయసు కలిగిన 1.3 బిలియన్ మంది పిల్లల్లో 50 శాతం మందికి ఇంటర్నెట్ సౌకర్యం, కంప్యూటర్ సౌకర్యం కూడా లేదని యునిసెఫ్-యు.టి.ఐ నివేదిక వెల్లడించింది. ఎన్.సి.ఆర్.టి సర్వే ప్రకారం దేశంలో 27శాతం విద్యార్థులు కంప్యూటర్లు, స్మార్ట్ ఫోన్లు లేనందువలన ఆన్‌లైన్ విద్య అందుకోలేక వెనుకబడ్డారు. భారతదేశంలోనే కోవిడ్ విపత్తు వల్ల సుమారు 32 కోట్ల మంది విద్యార్థులు అభ్యసనకు దూరమైనట్లు యునెస్కో 2020 నివేదిక వెల్లడించింది.

ఇందులో అధిక శాతం డిజిటల్ పరికరాలు అందుబాటులో లేనివారే అని మనం గుర్తు పెట్టుకోవాలి. మనదేశంలో కంప్యూటర్లు ఉన్న బడుల శాతం 22 మాత్రమే. ఈ సమస్యలేవీ ఇంకా సమసిపోలేదు. అందుకు తగిన చర్యలూ లేవు. అయినా డిజిటల్ విద్య వైపు మొగ్గు చూపుతున్నారు.

అసలు బడికే వెళ్ళలేని నిరక్షరాస్య కుటుంబాల్లోని పిల్లల పరిస్థితిని ఆలోచించ వలసిన ఆవశ్యకత వుంది. పట్టణాలకు, చదువుకు చాలా దగ్గరగా వున్న విద్యార్థులు ఒక వైపు - బడి బాటకన్నా కూలి పని, చేతి పని మిన్న అని భావిస్తూ చదువుపై అవగాహన లేని పిల్లలు మరోపక్క వున్న ప్రపంచంలో మనం ఉన్నామని ప్రభుత్వం గుర్తించాలి.

బైజూస్ సేవలు అందుకొనే విద్యార్థులు ఒక కోవకు చెందినవారు. మన పిల్ల లకు డిజిటల్ లిటరసీ పైన అవగాహన ఉండాలి. ఎంతవరకు డిజిటల్ అక్షరాస్యత సాధించాం అన్నదానిపై ప్రభుత్వం వద్ద లెక్కలు లేవు. సైబర్ భద్రత నియమాలపై పిల్లలకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్గించాలి. బైజూస్ ద్వారా లభ్యమయ్యే డిజిటల్ పాఠాలు వారు ఉపయోగించిన భాష మన రాష్ట్ర భాష, స్థానికతకు సరితూగుతుందా? అన్నది చూడాలి. ఒకవేళ బైజూస్ పాఠాలు పాఠశాలలోనే స్క్రీన్, ట్యాబుల ద్వారా అందుబాటులో ఉంచితే సైబర్ భద్రతాంశాలు, భాష, పిల్లలు ప్రాక్టీసుకు వెసులుబాటు కల్పించడం ఒక ప్రధాన అంశం. ట్యాబులకు తగినన్ని ఛార్జింగ్ పాయింట్ల ఏర్పాటు, ఇంటర్నెట్, విద్యుత్ నిరంతరం అందుబాటులో ఉండడం తప్పనిసరి. దీనిలో పాఠాలు ముందే రికార్డు చేసి ఉండటం వలన ఆఫ్ లైన్ కూడా వినడానికి వెసులుబాటు ఉంటుంది. కాని లైవ్ పాఠాలు వినే వెసులుబాటు ఉండదు. పిల్లల ఆరోగ్య భద్రత విషయానికొస్తే స్క్రీన్ సమయం ఎక్కువవుతుంది ఉపాధ్యాయులతో చర్చించే వెసులుబాటు ఉండదు.

బైజూస్‌తో ఒప్పందం, ట్యాబ్‌లతో పాఠాలు వల్ల ఉపాధ్యాయ పోస్టులు గల్లంతవు తాయి. డీఎస్సీపై ఈ ప్రభావాన్ని కాదనలేం, మూడేళ్ళుగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. ఇప్పటికే 25 వేల పోస్టులు ఖాళీగా వున్నాయి, వాటినుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం బైజూస్‌ను ముందుకు తెస్తోంది అన్న వాదన వుంది. ఉపాధ్యాయుల నియామకం, శిక్షణను నిర్లక్ష్యం చేస్తే మొదటికే మోసం వస్తుంది. ప్రభుత్వం ప్రాథమిక బాధ్యత అయిన విద్యారంగంలోకి కూడా కార్పొరేట్లను ఆహ్వాని స్తోంది. ఇది రాబోయే రోజుల్లో విద్యారంగానికి ప్రమాదకరం. ఇందుకు బదులుగా ఎన్.సి.ఈ.ఆర్.టీ.కి కేవలం వందకోట్లు కేటాయించినట్లయితే అందరికీ అర్థ మయ్యేలా స్థానిక పాఠాలను రూపొందిస్తుంది కదా!

ఆన్‌లైన్ విద్య అందుకోలేని పాఠశాల పిల్లలకు ప్రత్యామ్నాయ పద్ధతులు ప్రభుత్వం వద్ద ఉన్నాయా?, డిజిటల్ తరగతులను చేరుకునేందుకు పిల్లలకు తగిన డిజిటల్ పరికరాల ఏర్పాటుతో బాటు ఇంటర్నెట్ సౌకర్యాల కల్పనకు కార్యాచరణ ఉందా?. సాధారణ ప్రాథమిక-ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వయసు, తరగతి వారీ విద్యా సామర్థ్యాలను సాధించేలా ప్రణాళికలు రచించి అమలు చేయగలుగు తున్నామా? పిల్లల చదువులపై ఏటా వస్తున్న నివేదికల పరిస్థితి ఏమిటి?. కొవిడ్ కారణంగా కోల్పోయిన విద్యా సామర్థ్యాలను పునరుద్ధరించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసాం? చేస్తున్నాం? ఇవేవీ లేకపోగా పాఠశాలల విలీనం పేరుతో విద్యార్థులను, వారి తల్లితండ్రులను క్షోభ పెడుతున్నారు. హడావుడిగా కేంద్రం మెప్పు కోసం నూతన విద్యా విధానాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే వేగంగా అమలు చేస్తోన్న ఏపీ ప్రభుత్వం వీటి సంస్కరణల ఫలితాలను బేరీజు వేస్తోందా?

తాయిలాలు ఇచ్చి పిల్లలను బడికి రప్పించడం కన్నా భవిష్యత్తు తరాలకు భరోసాను కల్పించే నాణ్యమైన గుణాత్మక విద్యకు ప్రాధాన్యతనివ్వాలి. ఈ విషయంలో ఉపాధ్యాయులు, తలిదండ్రులు, పౌర సమాజం, విద్యావేత్తల సూచనలు పరిగణలోకి తీసుకోవాలి. దురదృష్టవశాత్తు అటువంటి ప్రయత్నాలు ఏవీ కానరావడం లేదు. పిల్లల తల్లితండ్రులను ఓటు బ్యాంకులుగా చూసినంత కాలం ఈ పరిస్థితిలో మార్పు రాదు. అంతవరకూ బైజూస్‌లు ప్రచార పటాటోపానికే పనికొస్తాయి.

వ్యాస రచయిత బాలల హక్కుల కార్యకర్త

జార్ఖండ్‌లో మరో దారుణం

మహిళా ఎస్ఐని ట్రక్కుతో ఢీకొట్టి హత్య

రాంచీ: గనుల దొంగలు, అక్రమ వ్యాపారులు బరితెగిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులను హతమారుస్తున్నారు. హరియాణాలోని నుహ్‌లో చట్టవిరుద్ధ గనుల తవ్వకాలను ఆపేందుకు ప్రయత్నించిన డీఎస్పీ ర్యాంకు అధికారిపై నుంచి వాహనాన్ని నడిపి హత్య చేసిన ఘటన జరిగిన కొద్ది గంటలకే జార్ఖండ్‌లోని రాంచీలో మరో దారుణం చోటుచేసుకుంది. ఆవుల అక్రమ రవాణాను ఆపేందుకు ప్రయత్నించిన మహిళా సబ్‌ఇన్‌స్పెక్టర్ సంధ్య టోప్నోపై నుంచి వాహనాన్ని నడిపి దుండగులు హత్య చేశారు. జార్ఖండ్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం ఎస్ఐ సంధ్య టోప్నో రాంచీలోని టుపుదన ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒడిశా నుంచి ఓ లారీలో ఆవులను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ లారీ రెండు చోట్ల గస్తీ బృందాల నిఘాను తప్పించుకోగలిగింది. చివరికి రాంచీ చేరుకుంది. సంధ్య టోప్నో ఆ లారీని ఆపడానికి ప్రయత్నించారు. కానీ డ్రైవర్ లారీని ఆపకుండా ఆమెపైకి దూకించాడు. దీంతో ఆమె ప్రాణాలు కోల్పోయారు. దీనిని గమనించిన ఇతర పోలీసులు ఆ లారీని వెంబడించారు. వేగంగా వెళ్తున్న ఆ లారీ ప్రమాదానికి గురై, బోల్తా పడింది. దానిని నడుపుతున్న నిసార్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో వ్యక్తి తప్పించుకోగలిగాడు. రాంచీ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ కౌశల్ కిషోర్ మాట్లాడుతూ లారీని, దానిలోని 10 ఆవులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. రాంచీ పోలీసు సంఘం ప్రతినిధి ఆనంద్ ఖల్కో మాట్లాడుతూ సంధ్య టోప్నో నిజాయతీగా తన కర్తవ్యాన్ని నిర్వహించేవారని, సమర్థతగల అధికారిణి అని చెప్పారు. ఆమె మరణానికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని, ఓ దృష్టాంతంగా నిలిచేలా ఆ శిక్ష ఉండాలని డిమాండ్ చేశారు. హరియాణాలోని నుహ్ వద్ద డీఎస్‌పీ ర్యాంక్ అధికారి సురేంద్ర సింగ్ బిష్ణోయ్‌పై నుంచి అక్రమ మైనింగ్ లారీ దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన కూడా ప్రాణాలు కోల్పోయారు.

గుజరాత్‌లో...

గుజరాత్‌లోని ఆనంద్ జిల్లాలో వాహన తనిఖీల సందర్భంగా పోలీసు కానిస్టేబుల్‌ను ఓ ట్రక్కు ఢీకొట్టినట్లు అధికారి ఒకరు తెలిపారు. బోర్సాద్ పట్టణానికి సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. కానిస్టేబుల్ కరణ్‌సిన్హ్ రాజ్ (40)ను ట్రక్ ఢీకొట్టిందని డీఎస్‌పీ డీహెచ్ దేశాయ్ తెలిపారు. ట్రక్ డ్రైవర్ తన వాహనాన్ని వదిలి అక్కడి నుంచి పారిపోయాడని, అతడి కోసం గాలిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

విమర్శలను భరించలేకే...

- అన్‌పార్లమెంటరీ పేరుతో కుట్ర
- పాలన చేతకానివాడు... అసమర్థుడు అంటే తప్పా?
- నోరు నొక్కేందుకే నిషేధం

న్యూఢిల్లీ: ఉపన్యాసాల్లో, రాజకీయ విమర్శల్లో చాలా సర్వసాధారణంగా ఉపయోగించే పదాలను తాజాగా మోదీ సర్కారు 'అన్‌పార్లమెంటరీ' పదాల జాబితాలో చేర్చడంపై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వెలువడ్డాయి. లోక్‌సభ, రాజ్యసభ ప్రసంగాల్లో సభ్యులు చాలా సాధారణ ప్రసంగాల్లో వినియోగించే పదాలు నిషేధిత జాబితాలో ఉండడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సిగ్గు, ద్రోహం, రక్తపాతం, మోసం, మార్పిడి, అవినీతి, అసమర్థుడు, పిరికివాడు, నేరస్థుడు, మొసలి కన్నీళ్లు, క్రూరత్వం, నాటకం, నకిలీ, తప్పుడు వంటి పదాలను అన్‌పార్లమెంటరీ పదాలుగా భావించడం ఏమిటని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ పదాలన్నీ మోదీ సర్కారు పాలనా తీరుపై విమర్శలకు పనికి వచ్చే పదాలైనందునే వాటిపై నిషేధం విధించినట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పదాల్లో ఏ ఒక్కటీ అసభ్యతను, అశ్లీలతను కనపర్చేవి కాకపోయినా అన్‌పార్లమెంటరీ పదాలుగా ఎందుకు గుర్తించాల్సి వచ్చిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. రాజకీయ విమర్శలను భరించలేని నియంత తరహా ప్రభుత్వం కాబట్టే ప్రతిపక్షాల భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే ఉద్దేశంతోనే ఈ చర్యలకు దిగినట్టు స్పష్టంగా కనిపిస్తోందనే వాదనకు బలం చేకూరుతోంది. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆయన తీసుకున్న నిర్ణయాలు పాలనా లోపాలను ఎత్తి చూపడంతో తాజాగా నిషేధిత జాబితాలో ఉన్న పదాలను ఉపయోగించే అవకాశం ఎక్కువని రాజకీయ పరిజ్ఞానం ఉన్నవారు ఎవరికైనా ఇట్టే అర్థమవుతోంది. ఈ విషయంపై స్పందించిన కొంతమంది రాజకీయ విశ్లేషకులు మాట్లాడుతూ...2014 నాటి లోక్‌సభ ఎన్నికల సమయంలో గ్యాస్ బండకు దండం పెట్టి ఓటు వేయాలని అభ్యర్థించి...అధికారంలోకి వచ్చాక గ్యాస్ ధర నాటికన్నా మూడింతలు పెరిగినా పట్టించుకోని 'మోసకారి' ప్రధాని మోదీ అని సాధారణంగానే విమర్శలు వస్తాయనే విషయాన్ని గుర్తు చేశారు.

ఇక్కడ మోసం అనేది అన్‌పార్లమెంటరీ పదం ఎలా అవుతుందని ప్రశ్నించారు. నేడు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దారుణంగా పడిపోతుంటే సరిదిద్దలేని 'అసమర్థుడు' ప్రధాని అని ప్రతిపక్షాలు విమర్శించకూడదు అంటే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుందని ప్రశ్నించారు. నోట్ల రద్దు సమయంలో అంతా 50 రోజుల్లో చక్కబడుతుందని మోదీ కార్చినవి మొసలి కన్నీరు అని విమర్శించడంలో అసభ్యత, అన్‌పార్లమెంటరీ భాష ఏముందని నిలదీశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ యువతను నమ్మించి 'మోసం' చేశారని మాట్లాడితే అందులో మోసం అనే పదం ఎలా అసభ్యతను, అగౌరవాన్ని ప్రతిబింబిస్తుందని సూటిగా ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 105 మాట్లాడే స్వేచ్ఛను ఇస్తుందని, అశ్లీలత, అసభ్యత లేని పదజాలంతో పాలనా లోపాలను విమర్శించే అవకాశం, సర్వజన ఆమోదం ఉన్న పదాలను పార్లమెంటు నిషేధించడంపై పెదవి విరిచారు. ఈ పదాలను ఇకపై సభలో ఏ సభ్యుడు తమ ప్రసంగాలలో ఉపయోగించకూడదని చెప్పడం తీవ్ర అభ్యంతరకర అంశంగానే పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ వివాదం పెద్దదయిన క్రమంలో స్పందించిన స్పీకర్ ఓం బిర్లా గౌరవం లేని పదాలను అన్‌పార్లమెంటరీ పదాలుగా పరిగణిస్తామంటూ ఇచ్చిన వివరణ అస్పష్టంగానే ఉంది. పార్లమెంటు తాజాగా నిషేధించిన పదాల్లో గౌరవానికి భంగం కలిగించే పదాలు ఏవీ లేవనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించకుండా విమర్శల జడివానను తప్పించుకునేందుకే ఈ తరహా చర్యలకు దిగిందనేది నిర్వివాదాంశం.

ఇదిలా ఉండగా పార్లమెంటు ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు ధర్నాలు, ప్రదర్శనలను ఈ ప్రభుత్వం నిషేధించడం అనాగరిక చర్యగానే చూడాల్సి ఉంటుందనేది ప్రతిపక్షాల వాదన. రాజ్యాంగంలోని ఆర్టికల్ 105 ప్రకారం ఎంపీలు సభలో మాట్లాడే బాష నిబంధనలకు అనుగుణంగానే ఉంటుంది. స్వేచ్ఛగా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకూడదనే సాధారణంగా పలికే పదాలపై నిషేధం విధించినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. నిజంగా సభ్యులు ఎవరైనా అసభ్యంగా మాట్లాడినా, అశ్లీల పదాలను ఉచ్ఛరించినా క్షమాపణలు చెప్పిన సందర్భాలున్నాయి. లోక్‌సభ నిబంధనల్లోని రూల్ 380 ప్రకారం పరువునష్టం కలిగించే, అసభ్యకరమైన, అన్‌పార్లమెంటరీ, గౌరవం లేకుండా చేసే పద ప్రయోగాలను రికార్డుల నుంచి తొలగించే విచక్షణాధికారం స్పీకర్‌కు ఉంది. ఇంత వెసులుబాటు ఉన్నా కేవలం ఒక కీలక నేతకు నేరుగా వర్తించే సర్వజనుల నోళ్లల్లో నానే పదాలను అన్‌పార్లమెంటరీ పదాలుగా ప్రకటించడం వెనుక ప్రతిపక్షాల నోరు నొక్కడమే ప్రధాన ఆశయం అనేది సుస్పష్టం.

పైగా తాజా నిషేధిత జాబితాల్లో ఉన్న చాలా పదాలు ఆ నేతకు నేరుగా తగిలేలా ఉండడం ఒక కారణంగానే ఈ తరహా చర్యలకు ఉపక్రమించిందనే వాదనలు బలం పుంజుకున్నాయి. రానున్న రోజుల్లో పార్లమెంటులోనే నిషేధించిన ఈ పదజాలంతో ఎవరు తమను విమర్శించినా వారిపై కేసులు నమోదు చేసేందుకు కూడా తెగబడతారనే వాదనలు ముందుకు వస్తున్నాయి. ఈ తరుణంలో పదాల నిషేధ ప్రకటనపై ప్రభుత్వ పెద్దలు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

త్రివిధ దళాల్లో 1.35లక్షల ఖాళీలు: కేంద్రం

న్యూఢిల్లీ: భారత త్రివిధ దళాల్లో 1.35 లక్షల ఖాళీలు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. అత్యధికంగా ఆర్మీలో 1,16,464 పోస్టులు ఖాళీగా ఉండగా..నావికా దళం(నేవీ)లో 13,537, వైమానిక దళంలో 5,723 ఖాళీలు ఉన్నాయని తెలిపింది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో ఏటా సగటున 60 వేలు, 5,332, 5,723 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్ భట్ బుధవారం తెలిపారు. రాజ్యసభలో లేవనెత్తిన ప్రశ్నకు అజయ్ భట్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సగటు నియామకాల సంఖ్య.. అగ్నివీరుల భర్తీ సంఖ్య కంటే ఎక్కువగా ఉందా? అలాంటప్పుడు సాయుధ దళాల్లో సిబ్బంది కొరతను ఎలా తీరుస్తారు?.. అనే ప్రశ్నకు మంత్రి నేరుగా సమాధానం ఇవ్వలేదు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని బదులిచ్చారు. ఆఫీసర్, నాన్-ఆఫీసర్ ర్యాంక్ సిబ్బందితో సహా మూడు సాయుధ దళాలలో మొత్తం సిబ్బంది కొరతపై స్పందించారు.

బెంగాల్‌లో కల్తీసారా కాటుకు ఏడుగురి బలి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో కల్తీసారా కాటుకు ఏడుగురు బలయ్యారు. హౌరాలో కల్తీసారా తాగడంతో వీరంతా మృతి చెందగా..మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. హౌరా జిల్లాలోని ఘుసూరీ అనే ప్రాంతంలో బుధవారం ఉదయం ఈ ఘటన జరిగింది. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే... మృతుల్లో కొందరికి అంత్యక్రియలు నిర్వహించారని అధికారులు చెబుతున్నారు. అస్వస్థతకు గురైన వారు చికిత్స పొందుతున్నారని తెలిపారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు వెల్లడించారు. షాపు యజమానిని అరెస్టు చేశామని తెలిపారు. ఆల్కహాల్ నమూనాలను వైద్య పరీక్షల నిమిత్తం పంపామని, పోస్టుమార్టం తర్వాతే మృతికి కారణాలు వెల్లడిస్తామని హౌరా పోలీస్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ త్రిపాఠి తెలిపారు. ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్ స్థానిక పోరులో ఏడుచోట్ల ఎంఐఎం విజయం

భోపాల్: మధ్యప్రదేశ్ నగర పాలిక ఎన్నికల్లో ఆల్ ఇండియా మజ్లిస్ ఈ ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఏఐఎంఐఎం) ఉనికి చాటుకుంది. ఈ నెల 6న జరిగిన ఎన్నికల్లో నాలుగు కార్పొరేటర్ స్థానాల్ని గెలుపొందిన ఎంఐఎం బుధవారం విడుదలైన ఫలితాల్లో మరో మూడు చోట్ల విజయం సాధించింది. బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో తొలిసారి స్థానిక పోరులో ఎంఐఎం వివిధ నగర పాలికల్లో అభ్యర్థులను రంగంలోకి దింపి పార్టీ ఉనికిని చాటుకుంది. ఖర్గోన్ నగర పాలిక సంస్థలోని మూడు వార్డుల్లో ఎంఐఎం అభ్యర్థులు విజయం సాధించి అధికార బీజేపీని గట్టిదెబ్బ కొట్టారు. నగరంలోని రెండో వార్డు నుంచి ఎంఐఎం టికెట్టుతో పోటీ చేసిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన అరుణాబాయి బీజేపీ అభ్యర్థి సునీతదేవిపై 31 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అదే నగర పాలికలో 15వ వార్డులో షకీల్ ఖాన్, 27వ వార్డు నుంచి షబ్నం అనే అభ్యర్థులు గెలుపొందారు. ఎంఐఎం అభ్యర్థి అరుణాబాయి మాట్లాడుతూ ఎంఐఎం అధినేత ఓవైసీ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలపై మాట్లాడుతున్నందునే తాను ఆ పార్టీలో చేరినట్టు పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన జబల్‌పూర్ పురపాలికలో రెండు స్థానాల్ని, బుర్హాన్‌పూర్, ఖాండ్వా పురపాలికల్లో ఒక్కో స్థానాన్ని ఎంఐఎం తన ఖాతాలో వేసుకుంది.

రూ.100 కోట్లకు 'మహా' మంత్రిస్థానం

బీజేపీ ఎమ్మెల్యేకు ఆశ- నలుగురి అరెస్టు

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో నాటకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన క్రమంలో మంత్రి పదవుల కేటాయింపు సమయంలో రూ.100 కోట్లు ఇస్తే మంత్రి పదవి ఇప్పిస్తానంటూ నలుగురు వ్యక్తులు ఓ ఎమ్మెల్యేకు ప్రతిపాదించడం చర్చనీయాంశంగా మారింది. ఆ ఎమ్మెల్యే ఈ ప్రతిపాదనను స్వీకరించినట్లు నటించి నలుగురి ముఠాను పోలీసులకు పట్టించారు. దౌండ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాహుల్ కుల్‌ను రియాజ్ షేక్ అనే వ్యక్తి ఆశ్రయించి రూ.100 కోట్లు ఇస్తే కేబినెట్‌లో మంత్రి పదవి ఖరారు చేయిస్తానని చెప్పగా దానిని స్వీకరించినట్లు నటించిన ఎమ్మెల్యే బేరమాడి రూ.90కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో 20శాతం అడ్వాన్స్‌గా ఇవ్వాలని రియాజ్ అడిగితే ఒప్పుకొన్న ఎమ్మెల్యే తనను తర్వాత కలవమని చెప్పారు. ముంబైలోని ఓ హోటల్‌లో అతనిని కలిసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఎమ్మెల్యే వెల్లడించారు. 'ఈనెల 15న రియాజ్ షేక్ అనే వ్యక్తి నుంచి నా పీఏకు ఫోన్ వచ్చింది. ఎమ్మెల్యేతో ఆఫర్ గురించి మాట్లాడాలని అతను చెప్పాడు. దీంతో ముంబైలోని ఓ హోటల్‌లో అతనిని కలిశాను. ఓ సీనియర్ రాజకీయ నేత ఈ పని చేసి పెడతారని, అందుకోసం రూ.100 కోట్లు ఇవ్వాలన్నాడు. అతనిని నమ్మించేందుకు బేరమాడి రూ.90కోట్లకు ఒప్పించాను. అడ్వాన్సుగా 20శాతం డబ్బును రియాజ్ డిమాండు చేశాడు. అందుకు ఒప్పుకొని, తర్వాత రమ్మని చెప్పాను' అని రాహుల్ కుల్ వెల్లడించారు. అనంతరం పార్టీ పెద్దలకు సమాచారాన్ని అందించడమే కాకుండా మేరిన్ డ్రైవ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ముంబై పోలీసు కమిషనర్ వివేక్ ఫన్సాల్కర్ ఈ కేసును నగర క్రైంబ్రాంచ్‌కు అప్పగించారు. రంగంలోకి దిగిన క్రైంబ్రాంచ్ పథకం ప్రకారం నిందితులను పట్టుకుంది. దర్యాప్తు కోసం నిందితులను పోలీసు కేంద్ర కార్యాలయానికి తరలించింది. రియాజ్ షేక్, యోగేశ్ కులకర్ణి, సాగర్ సంఘ్వి, జాఫర్ ఉస్మానిగా పోలీసులు వారిని గుర్తించారు. నలుగురిని ఈనెల 26 వరకు రిమాండుకు పంపారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఉస్మానీకి దిల్లీలో ఎవరితోనో పరిచయం ఉందని, ఉస్మానీనే ఈ ముఠా నడుపుతున్నాడని పోలీసు వర్గాల సమాచారం. దిల్లీలోని ఆ వ్యక్తి ఎవరని పోలీసులు విచారిస్తున్నారు.

మహిళను 12 కి.మీ. భుజాలపై మోసుకెళ్లిన బంధువులు

ఉత్తర కాశీ: చంద్రునిపై జనావాసాల నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్న కాలంలో భూమి మీద రోగం వస్తే చికిత్స చేయించుకోవడానికి సదుపాయాలు అందుబాటులో ఉండటం లేదు. నగరాలు, పట్టణాలు మినహా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల పరిస్థితులు దయనీయంగా ఉన్నాయి. మారుమూల ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ఎంత పెద్ద రోగం వచ్చినా సమీపంలోని పట్టణానికి వెళ్లడం చాలా కష్టంగా మారింది. ఉత్తరాఖండ్‌లోని బడియార్ సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన ఓ మహిళ, ఆమె బంధువులు ఎదుర్కొన్న పరిస్థితే తాజా ఉదాహరణ. ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశి జిల్లా డింగడి గ్రామస్తురాలు శకుంతల దేవి(52) ఓ వారం నుంచి తీవ్రమైన అతిసార, జ్వరంతో బాధపడుతున్నారు. వంటింటి చిట్కాలు ఫలితం ఇవ్వకపోవడంతో ఆమెను 12 కిలోమీటర్ల దూరంలోని సర్నోల్‌లో ఉన్న ఓ వైద్యుని వద్దకు తీసుకెళ్లాలని ఆమె బంధువులు నిర్ణయించుకున్నారు. ప్రయాణానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో బంధువులు ఆమెను భుజాలపై మోసుకెళ్లారు. వెదురు కర్రలతో చేసిన ఓ చట్రానికి ఓ కుర్చీని కట్టి, ఆ కుర్చీలో ఆమెను కూర్చోబెట్టి బంధువులు తమ భుజాలపై మోసుకెళ్లారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా ఉత్తరాఖండ్ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 22 ఏళ్లు గడుస్తున్నా బడియార్ జిల్లాలోని ఎనిమిది గ్రామాలు ఇప్పటికీ సరైన మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సార్, డింగడి, గోథుక, పంటి, కిందార్, లెవ్టాడీ గ్రామాల్లో కనీస విద్య, వైద్య, రహదారి సదుపాయాలు లేవని వాపోతున్నారు. వైద్య సదుపాయం లేకపోవడం వల్ల కొందరు రోగులు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రపంచంలో శక్తిమంత పాస్‌పోర్టులు

న్యూఢిల్లీ: కరోనా మహమ్మారి దుష్ప్రభావం, ప్రతికూల పరిస్థితుల కారణంగా శక్తివంతమైన పాస్‌పోర్టుల ర్యాంకింగ్స్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ జాబితాలో యూరోపియన్ దేశాలే ఎప్పుడూ అగ్రభాగాన నిలిచేవి. అయితే ఈసారి ఆసియా దేశాలు టాప్ స్థానాల్లోకి దూసుకొచ్చాయి. ప్రపంచ శక్తివంత పాస్‌పోర్ట్- 2022 జాబితాలో జపాన్ పాస్‌పోర్ట్‌కు నంబర్ వన్ స్థానం దక్కింది. ఆ దేశ పౌరులు ఎలాంటి అవరోధాలు లేకుండా ఏకంగా 193 దేశాలకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. అంటే వీసా లేకుండానే దాదాపు ప్రపంచమంతా చుట్టేయొచ్చు. ఇక సింగపూర్, దక్షిణకొరియా ఉమ్మడిగా రెండో స్థానంలో నిలిచాయి. ఈ దేశాల పాస్‌పోర్టులతో 192 దేశాలకు పోవచ్చు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ సంస్థ హెన్లే అండ్ పార్టనర్స్ ఒక నివేదికను విడుదల చేసింది. ప్రపంచ దేశాలు ఇప్పుడిప్పుడే కరోనా నుంచి కోలుకుంటున్న తరుణంలో పాస్‌పోర్ట్ ర్యాంకింగ్స్‌లో మార్పులు కనిపిస్తున్నాయని వెల్లడించింది. చిట్టచివరి స్థానంలో అఫ్ఘానిస్తాన్..186 దేశాల్లోకి ప్రవేశంతో అమెరికా పాస్‌పోర్ట్ 7వ స్థానంలో, బ్రిటన్ 6వ స్థానంలో(187 దేశాలు) ఉన్నాయి. ఇక రష్యా పాస్‌పోర్ట్ 50వ ర్యాంకులో నిలిచింది. రష్యా పాస్‌పోర్టుకు 119 దేశాల్లోకి ఎంట్రీ ఉంది. 80 దేశాల ప్రవేశంతో చైనా 69వ ర్యాంకు, 87 దేశాల్లోకి ఆటంకాలు లేని ప్రవేశంతో భారత్ 87వ స్థానంలో నిలిచాయి. పవర్‌ఫుల్ పాస్‌పోర్టుల ర్యాంకింగ్‌లో అఫ్ఘానిస్తాన్ చిట్టచివరి స్థానంలో నిలిచింది. కేవలం 27 దేశాల్లోకి మాత్రమే ఈ పాస్‌పోర్టుతో ప్రవేశం ఉంది. కరోనా ముందు లాగా స్వేచ్ఛాయుత ప్రయాణానికి ఇంకా సమయం పడుతుందని హెన్లే అండ్ పార్టనర్స్ చైర్మన్ క్రిస్టియాన్ కెలిన్ చెప్పారు. ప్రపంచ దేశాలు ఇంకా కోలుకోవాల్సి ఉందన్నారు. రికవరీ తర్వాతే ప్రయాణాలు సాధారణ స్థాయికి చేరతాయన్నారు. కరోనా పరిస్థితులను ఉదహరిస్తూ.. పవర్‌ఫుల్ పాస్‌పోర్ట్-2017 జాబితా టాప్-10లో ఆసియా దేశాలు అరుదుగా కనిపించాయని, అయితే యూరోపియన్ దేశాల ఆధిపత్యం తగ్గిందని క్రిస్టియాన్ అన్నారు. దక్షిణకొరియా కంటే జర్మనీ వెనుకబడిందని చెప్పారు. కోవిడ్ ఆంక్షల కారణంగా ప్రపంచ ప్రయాణాలు ఇంకా సంపూర్ణంగా రికవరీ అవ్వలేదన్నారు. 17 ఏళ్ల డేటాని విశ్లేషించి ఈ తాజా ర్యాంకింగ్స్‌ని నిర్ణయించామని చెప్పారు. వీసా లేకుండా ఎన్ని దేశాల్లోకి ప్రవేశం లభిస్తోందనే దాని ఆధారంగా సంపన్న వర్గాలు, ప్రభుత్వాలు పౌరసత్వం విలువని అంచనా వేసుకుంటాయి.

కుటుంబశ్రీ దుకాణాల్లో ప్యాకెట్లపై జీఎస్టీ ఎత్తివేత

కేరళ ప్రభుత్వం కీలక నిర్ణయం

తిరువనంతపురం: నిత్యావసర వస్తువులపై జీఎస్టీ విధించడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేరళ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 'కుటుంబ శ్రీ' లేదా చిన్న చిన్న దుకాణాల్లో 1, 2 కేజీల ప్యాకెట్ల రూపంలో విక్రయించే వస్తువులపై జీఎస్టీ విధించబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి కేఎన్ బాలగోపాల్ అసెంబ్లీ వేదికగా బుధవారం ప్రకటన చేశారు. ఈ విషయంలో కేంద్రంతో పేచీ వచ్చినా తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టంచేశారు. 'కుటుంబ శ్రీ' అనేది కేరళలో స్వయం సహాయక సంఘం. మహిళా సాధికారత కోసం ఉద్దేశించిన దేశంలో అతిపెద్ద ప్రాజెక్ట్ ఇదే. వీటి అధ్వర్యంలో చిన్న తరహా ఆహార శుద్ధి పరిశ్రమలు నడుస్తుంటాయి. 'కుటుంబ శ్రీ, చిన్న చిన్న స్టోర్లలో విక్రయించే 1 లేదా 2 కేజీల ప్యాకెట్లకు గానీ, లూజుగా విక్రయించే నిత్యావసర సరుకులకు గానీ ఎలాంటి జీఎస్టీ విధించబోం. ఈ విషయంలో కేంద్రం అభ్యంతరం చెప్పినా వెనకడుగు వేయం. ఇదే విషయమై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. సీఎం విజయన్ సైతం నిన్ననే కేంద్రానికి ఓ లేఖ రాశారు. చిన్న తరహా వ్యాపారులు, చిరు వ్యాపారులపై పన్నులు వేయాలని మేం అనుకోవడం లేదు' అని బాల గోపాల్ పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ విధించడంపై ప్రధాని జోక్యం చేసుకోవాలని కోరుతూ విజయన్ ప్రధాని మోదీకి లేఖ రాశారు. జీఎస్టీ వల్ల సామాన్యులు ఇబ్బంది పడతారని వివరించారు. ముఖ్యంగా కేరళలో మిల్లర్లు, చిన్న చిన్న దుకాణాలు నడిపేవారు సైతం వస్తువులను ముందుగానే ప్యాకేజీ చేసి విక్రయిస్తుంటారని విజయన్ లేఖలో పేర్కొన్నారు. ప్యాక్ చేసి విక్రయించడమనేది సర్వసాధారణమైన విషయమని తెలిపారు. ప్యాక్ చేసి విక్రయించే వస్తువులను తాజాగా జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం వల్ల చిన్న చిన్న దుకాణాల్లో కొనుగోలు చేసే వినియోగదారులపై భారం పడుతుందని తెలిపారు.

మోదీ ప్రజల మాట కూడా వినాలి

- ఆహార వస్తువులపై జీఎస్‌టీ ఉపసంహరించుకోవాలి
- కాంగ్రెస్ నేత రాహుల్ డిమాండ్



న్యూఢిల్లీ : ప్యాకేజ్డ్ ఆహార వస్తువులపై వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధించడంపై ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ బుధవారం విరుచుకుపడ్డారు. 'స్నేహితులు' చెప్పని మాటలు కూడా వినే ప్రధాని ప్రజల మాటలు కూడా వినాలని, ఈ చర్యను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న ప్రజల కోసం 'గబ్బర్' వంటకం తక్కువ సంపాదించడం, తక్కువ తినడం, 'ఉత్తుత్తి వాగ్దానాల'తో ఆకలిని తీర్చుకోవడం' అని ఆయన అన్నారు. ద్రవ్యోల్బణం మరింత పెరగడానికి దారితీసే కొన్ని నిత్యావసర వినియోగ వస్తువులపై ప్రభుత్వం పన్నులు పెంచడం 'క్రూరం' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'ద్రవ్యోల్బణంతో పోరాడుతున్న ప్రజల కోసం 'గబ్బర్' వంటకం : తక్కువ చేయండి, తక్కువ తినండి, 'తడ్కా ఆఫ్ జుమ్లాస్' (ఉత్తుత్తి హామీలు) తో ఆకలిని తీర్చుకోండి. 'స్నేహితుల' చెప్పని మాటలను కూడా వినే ప్రధాని ఇప్పుడు ప్రజల మాటలను కూడా విని ఈ జీఎస్‌టీని ఉపసంహరించుకోవాలి' అని రాహుల్ హిందీలో చేసిన ట్వీట్‌లో పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, జీఎస్‌టీ రేట్ల అంశంపై పార్లమెంట్‌లో అత్యవసర చర్చ జరగాలని కాంగ్రెస్, ఇతర పార్టీలు కోరుతున్నాయి. సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఈ అంశంపై సభలో విపక్ష పార్టీల నిరసనలతో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. జీఎస్‌టీని 'గబ్బర్ సింగ్ ట్యాక్స్' అని పిలుస్తున్న రాహుల్ గాంధీ బుధవారం దీనిని 'గృహస్తి సర్వనాశ్ పన్ను'గా అభివర్ణించారు. ఇది సామాన్య కుటుంబాలకు పెద్ద దెబ్బ అని తెలిపారు.

ద్రవ్యోల్బణంపై చర్చించడం 'అమర్యాద' కాదా : ప్రియాంక గాంధీ

పార్లమెంట్‌లో చర్చకు దూరంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇంటి ఖర్చులను పెంచుతున్నారని, ద్రవ్యోల్బణంపై చర్చించడం 'అమర్యాద' కాదా అని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం ప్రశ్నించారు. హిందీలో చేసిన ట్వీట్‌లో, తీవ్రమైన ద్రవ్యోల్బణం మధ్య గృహాలకు 'సంజీవని' (పెద్ద ప్రోత్సాహం) అవసరమని ఆమె పేర్కొన్నారు. పిండి, ధాన్యాలు, బెల్లం, పెరుగుపై 'గృహస్తి సర్వనాశ్ పన్ను (జీఎస్‌టీ)' (గృహ విధ్వంసపు పన్ను) విధించడం ద్వారా బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ద్రవ్యోల్బణ భారాన్ని మరింత పెంచిందని తెలిపారు. ద్రవ్యోల్బణం, రోజువారీ ఉపయోగించే కొన్ని వస్తువులపై జీఎస్‌టీ పెంపునకు వ్యతిరేకంగా పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రతిపక్ష నేతల చిత్రాన్ని కూడా ట్వీట్ చేశారు.

కరోనా ముప్పు తొలగిపోలేదు

రాష్ట్రాలను హెచ్చరించిన కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ: కోవిడ్-19 వ్యాప్తితో అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. కరోనా విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని సూచించింది. కరోనా సోకిన వారిన గుర్తించి హోమ్ ఐసోలేషన్‌లో ఉంచి ఆ కేసులను నిరంతరం పర్యవేక్షించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కోరింది. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, అసోం, ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ఆరోగ్యశాఖల అధికారులతో కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ బుధవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశం వివరాలను ఒక ప్రకటనగా విడుదల చేశారు.

కరోనా వ్యాప్తి క్రమంగా పెరుగుతున్నందున వైరస్ సోకినవారిని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని, వారిని సమాజంలో కలిసిపోకుండా చర్యలు చేపట్టాలని కోరింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కరోనా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి జిల్లాల వారీగా కేంద్రానికి నివేదికలు పంపించాలని సూచించింది. వ్యాధి నిర్ధారణ చర్యలను వేగవతం చేయాలని, సకాలంలో వ్యాధిని గుర్తిస్తేనే సామాజిక వ్యాప్తిని నిలువరించవచ్చునని పేర్కొంది. హోం ఐసోలేషన్‌లో ఉన్న వారికి కిట్లను అందించి అవగాహన కల్పించాలని కేంద్రం సూచించింది. విదేశాల నుంచి వస్తున్న వారిలో వ్యాధి బారినపడినట్టు గుర్తిస్తే వారి నమూనాలను పరీక్షించడానికి ఇండియన్ జెనోమిక్స్ కన్సార్టియం నెట్‌వర్క్‌కు పంపించాలని కోరింది. కరోనా ముప్పు పూర్తిగా తొలగిపోలేదని హెచ్చరించింది. కేసులు పెరుగుతన్నట్లు స్పష్టమవుతున్న తరుణంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరింది.

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై జేవీఎస్ఎన్ మూర్తి, ముప్పాళ్ల, మారుతి వరప్రసాద్, జంగాల తదితరులు

మహాప్రదర్శనలో ఒక భాగం

రాఘవాచారి విశేషాలు పంపండి

విశాలాంధ్ర- విజయవాడ: సుప్రసిద్ధ పాత్రికేయులు, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సీ రాఘవాచారి ఉపన్యాసాలు, సన్మానాలు, వ్యాసాల గురించి ఎలాంటి సమాచారమైనా సీ రాఘవాచారి ట్రస్ట్‌కు పంపాల్సిందిగా మేనేజింగ్ ట్రస్టీ కనపర్తి జోత్స్న ఓ ప్రకటనలో కోరారు. ఆయన ఎన్నో వేదికలపై ఉపన్యాసాలు ఇచ్చారని, వివాహాలు చేశారని, సన్మానాలందుకున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాలను ఎవరైనా భద్రపరచి ఉంటే, వివిధ పత్రికల్లో వారి వ్యాసాలు, వారి కృషి గురించి తమ దృష్టికి రాని సమాచారాన్ని పంచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు కనపర్తి జోత్స్న, మేనేజింగ్ ట్రస్టీ, సీ రాఘవాచారి ట్రస్ట్, ఫ్లాట్ నెం.14, నారాయణ స్కూల్ ఎదురు రోడ్డు, మారుతీనగర్, సికింద్రాబాద్-11, మొబైల్: 7981881912కు గానీ బుడ్డిగ జమిందార్, డోర్ నెం. 54-14/311/ఎ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలని, విజయవాడ - 520008, మొబైల్: 98494 91969ను సంప్రదించాలని కోరారు.

సివిల్ అభ్యర్థులకు ఆ అవకాశాలివ్వలేం: కేంద్రం

న్యూఢిల్లీ: సివిల్స్ రాసే వారికి అదనపు అవకాశాలు మంజూరు చేయలేమని కేంద్రం తెలిపింది. వయోపరిమితి సడలింపు, పరీక్షలు రాసేందుకు అదనపు అవకాశాలను పెంచుతూపోతే ప్రతస్తుమున్న నిబంధనలన్నీ సడలించాలని, అది జరిగేపని కాదని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభకు రాతపూర్వకంగా వెల్లడించారు. కోవిడ్ క్రమంలో సివిల్స్ అభ్యర్థుల వయోపరిమితి సడలింపు, అదనపు ప్రయత్నాన్ని మంజూరు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు వేసిన అంశాన్ని మంత్రి ప్రస్తావించారు.

పాలన గాలికి వదిలేశారు

- ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నారు
- బహిరంగ సభలో రామకృష్ణ

విశాలాంధ్ర -నరసరావుపేట: రాష్ట్రంలో పరిపాలనను గాలికి వదిలేసి ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు ఎవరి ఆదాయం వారు చూసుకుంటూ ప్రజలపై మోయలేని పన్నుల భారాన్ని మోపుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని ఏంజెల్ టాకీస్ సెంటర్‌లో బుధవారం జరిగిన సీపీఐ పల్నాడు జిల్లా మహాసభలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, దళితులకు రక్షణ లేదని అన్నారు. దీనిపై సీఎం ఎక్కడా స్పందించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ దళిత డ్రైవర్‌ను కొట్టి చంపి, డోర్ డెలివరీ చేసేందుకు వెళ్లాడని, అదేమని ప్రశ్నిస్తే రెండు లక్షలు ఇస్తా నని, శవాన్ని తీసుకోవాలని కుటుంబ సభ్యులను భయపెట్టాడని అన్నారు. అలాంటి ఎమ్మెల్సీని జైల్లో పెడితే ఆ పార్టీ నాయకులు అతనికి పాలాభిషేకం చేస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు విజయవాడలో ధర్నాలు చేసేందుకు అనుమతులు ఇవ్వడం లేదని, విజయవాడ జగన్‌మోహన్ రెడ్డి అబ్బ జాగీరా అని ప్రశ్నించారు. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు అలాంటి మహా నాయకులు విజయవాడలో ఎన్నో ప్రజా ఉద్యమాలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని వెనక్కి నడిపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో అభివృద్ధి నిలిచిపోయిందని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాకముందు రాజధాని అమరావతిలో 40 వేల మంది కార్మికులు పనిచేసేవారని, ప్రస్తుతం ఆ ప్రాంతంలో వాచ్ మెన్‌లు మాత్రమే ఉన్నారని అన్నారు. ఇటీవల జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు ముఖ్యమంత్రిని పొగిడేందుకు, ప్రతిపక్ష నాయకుడిని తిట్టడానికి తమ సమయాన్ని కేటాయించారని, ప్రజా సమస్యలను ఎక్కడా ప్రస్తావించలేదని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత మూడేళ్లలో అప్పు రూ.8 లక్షల కోట్లకు చేరిందని, ఈ ముఖ్యమంత్రి దిగిపోయే నాటికి అప్పు రూ.10 లక్షల కోట్లకు చేరుతుందని అన్నారు. ఆంధ్రాలో, రాయలసీమలో ఎక్కడ పరిశ్రమలు, ప్రాజెక్టులు నిర్మించలేదని, అప్పులతో రాష్ట్రాన్ని, ప్రజలను నాశనం చేస్తున్నారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ విలువ రూ.50 లోపు ఉండేదని, ఇప్పుడు రూ.78 చేరిందని అన్నారు. ఆర్థిక వేత్తలు నిర్వహించిన సర్వేలో భారతదేశం 101వ స్థానంలో ఉందని, మన దేశం కన్నా పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ అభివృద్ధిలో ముందు ఉన్నాయని అన్నారు. మోదీ ప్రజల సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతున్నారని రామకృష్ణ అన్నారు. ప్రజలను మతపరంగా విభజిస్తూ, రెచ్చగొడుతూ రాజకీయంగా బలపడేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం దేశం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని, ప్రజలందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తిరగబడాలని పిలుపునిచ్చారు. రానున్న కాలంలో సీపీఐ ప్రత్యేక హోదా, విభజన హామీలు, ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై సమరశీల పోరాటాలు చేపడుతుందన్నారు. పల్నాడు ప్రాంతంలో బలమైన ఉద్యమాలు జరిగాయని, రానున్న రోజుల్లో ఆ ఉద్యమాల స్ఫూర్తితో ఈ ప్రభుత్వాలపై మళ్లీ ఉద్యమాలు నిర్మించాలని అన్నారు. సీపీఐ పేద ప్రజలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారా యణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత మెగా డీఎస్సీ నిర్వహిస్తానని హామీ ఇచ్చి, ఆ హామీని తుంగలో తొక్కారని విమర్శిం చారు. నూతన విద్యా విధానంతో విద్య విధ్వంసం అవుతుందని అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే యువత తిరగబడిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. సీఎం జగన్ యువతకు ఉపాధి చూపించకుండా మోసం చేశారని అన్నారు. సైన్యాన్ని కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తూ మోదీ దేశ సైనిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. పెరుగు మీద జీఎస్టీ విధించి సామాన్య ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముస్లింలకు గత ప్రభుత్వం దుల్హన్ పథకం కింద అందజేస్తున్న రూ.50 వేలను లక్షకు పెంచుతానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి ముస్లింలను మోసం చేశాడని అన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడు సీపీఎస్ గురించి మాట్లాడటం లేదని, అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, మాట తప్పారని అన్నారు. సీపీఐ అధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టిన నేపథ్యంలో రూ.20 వేల లోపు డిపాజిట్ ఉన్నవారికి రూ.600 కోట్ల నగదును బటన్ నొక్కాడని అన్నారు. మూడు రాజధానుల పేరుతో అమరావతి రాజధానిని విధ్వంసం చేసి వంద సంవత్సరాలు వెనక్కి నెట్టాడని విమర్శించారు. వ్యవసాయ కూలీలు చితికిపోయారని, శ్రామికులు జీవించలేని పరిస్థితులలో ఉన్నారని అన్నారు. గుజరాత్ వ్యాపారులు బ్యాంకులను కొల్లగొట్టి విదేశాలకు పారిపోతుంటే ఏమి చేయలేని దద్దమ్మ నరేంద్ర మోదీ అని అన్నారు. నరేంద్ర మోదీ, సీఎం జగన్‌లది తండ్రి కొడుకుల బంధమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారని, వీరిద్దరూ కలిసి దేశాన్ని, రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. రానున్న రోజుల్లో నాలుగున్నర కోట్ల చిల్లర దుకాణాల వర్తకులు, కార్పొరేట్ మాల్స్‌లో గుమస్తాలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చట్ట సభల్లో కమ్యూనిస్టులు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రతిఒక్కరూ సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ముప్పాళ్ల పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఆస్తి పన్ను, ఇంటి పన్ను, చెత్త పన్నుల పేరుతో ప్రజలపై మోయలేని పన్నుల భారాలను మోపుతోందని అన్నారు. ఉద్యమాలకు పల్నాడు జిల్లా ఖిల్లా కానుందని అన్నారు. పల్నాడు ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, రైతుల నుంచి వేలాది ఎకరాలు తీసుకొని రియల్ ఎస్టేట్ కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు. తొలుత పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు సభా పరిచయం చేశారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చంద్రయ్య, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణమూర్తి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, గుంటూరు నగర అధ్యక్షులు మాల్యాద్రి, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు సుభాని, భూదాల శ్రీనివాసరావు, ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, ఉప్పలపాటి రంగయ్య, వేద వెంకట్, సత్యనారాయణ రాజు, తిరుపతయ్య, లింగయ్య, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ శెట్టి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షల వాయిదా

న్యూఢిల్లీ: జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు వాయిదా పడ్డాయి. వాస్తవానికి గురువారం అంటే 21వ తేదీ నుంచి 30 వరకు ఈ పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే ఈ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు జాతీయ పరీక్షల మండలి (ఎన్‌టీఏ) బుధవారం తెలిపింది. అందుకుగల కారణాలను మాత్రం వెల్లడించలేదు. వాయిదా పడ్డ పరీక్షలు 25వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఎన్‌టీఏ పేర్కొంది. జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షలు జూన్ 23-29 తేదీల్లో జరుగగా ఫలితాలు జులై 11న వెలువడిన విషయం విదితమే.

ఈ ఘనత వారిదే

కోవిడ్ టీకాల పంపిణీపై వాక్సినేటర్లకు ప్రధాని అభినందన లేఖ

న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారి అంతానికి ప్రతి ఒక్కరికీ టీకా ఇవ్వాలన్న లక్ష్యంతో వాక్సినేషన్‌ను భారతదేశం ముమ్మ రంగా చేపట్టింది. ఇప్పటివరకు 200 కోట్ల టీకాల మైలురాయిని భారత్ దాటేసింది. దీంతో ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత వారిదే అని వాక్సి నేటర్ల (టీకాలు వేసేవారు)ను ప్రశంసిస్తూ అభినందన లేఖ విడుదల చేశారు. 'ప్రాణరక్షణే ధ్యేయంగా విధినిర్వహణలో ఎంతో నిబద్ధతగా వైద్యఆరోగ్యసిబ్బంది, సహాయ సిబ్బంది వ్యవహరించారు. వారి సేవలు అభినంద నీయం' అని కొనియాడారు. మహమ్మారి వేళ సంక్షోభ స్థితిని అధిగమించే క్రమంలో భారత్ సాధించిన విజయాలను చూసి భావితరాలు గర్విస్తాయని పేర్కొ న్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో వాక్సినేటర్లు, హెల్త్‌వర్కర్లు, సహాయ సిబ్బంది, ఫ్రంట్‌లైన్ వర్కర్లు పోషించిన పాత్ర కీలక మని శ్లాఘించారు. క్లిష్ట సమయంలో అంకిత భావంతో విధులు నిర్వర్తించారని మోదీ ప్రశంసించారు. మంచు పర్వ తాలు మొదలు అధిక ఉష్ణోగ్రతలు ఉండే ఎడారులు, దూరపు గ్రామాలు, దట్టమైన అడవుల వరకు కోవిడ్ టీకాల కార్యక్రమం సాగిందని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద టీకా పంపిణీ కార్యక్రమాన్ని భారతదేశం ఎంతో సమర్థవంతంగా, వేగవం తంగా చేపట్టింది. ఇదంతా ప్రజల కష్టఫలం. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని భారత్‌లో కోవిడ్-19 వాక్సినేషన్ కార్యక్రమానికి తోడ్పడిన ప్రతి ఒక్కరిని మెచ్చుకుంటున్నా. ఆపద కాలంలో ప్రజల ప్రాణాలు రక్షించడమే ధ్యేయంగా పనిచేసిన వారిని అభినందిస్తున్నా. 200 కోట్ల టీకాల మైలురాయికి చేరు కోవడం మనదేశ ప్రజాస్వామిక బలానికి, కరుణకు, సేవాదృక్ప థానికి నిదర్శనం. సంక్షోభం వేళ భారత్ చూపిన ధైర్యసాహ సాలు రాబోయే తరాలకు గర్వకారణం. మీకు, మీ కుటుంబ సభ్యులకు నా శుభాభినందనలు ! జైహింద్!' అని లేఖలో మోదీ పేర్కొన్నారు. ప్రధాని లేఖ హిందీ, ఆంగ్ల భాషల్లో ఉందని, వాక్సినేటర్లు దీనిని కోవిన్ పోర్టల్‌లో లాగిన్ చేసి వీక్షించవచ్చని, అక్కడ ఉన్న లింకుతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఈ యాప్ ద్వారానే సామాజిక మాధ్యమాల్లో పంచుకోవచ్చని ఓ అధికారి తెలిపారు. కేంద్ర ఆరోగ్యశాఖ అందించిన వివరాల ప్రకారం భారత్ జనాభాలో దాదాపు 98శాతం మంది వయోజనులు కోవిడ్ మొదటి టీకాను, 90శాతం మంది రెండు టీకాను తీసుకున్నారు. 15-18 ఏళ్ల వారిలో 82శాతం మంది మొదటి టీకాను, 62శాతం మంది రెండో టీకాను పొందారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కృష్ణా పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల వలన శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,75,266 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జూరాల స్పిల్‌వే నుంచి 1,05485 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,47,482 క్యూసెక్కులు, జూరాల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా 35,152 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి తెలంగాణా విద్యుత్ ఉత్పత్తికి 19.070 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌కు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 175.105 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 885 అడుగులు. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో 877 అడుగుల నీరు నిల్వ ఉంది. ఇదే స్థాయిలో ఇన్‌ఫ్లో కొనసాగితే మరో రెండు రోజుల్లో శ్రీశైలం స్పిల్‌వే గేట్లు ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.